ANN తెలుగు
Follow: @ANNTELUGU
23-03-2026
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 85 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో
# ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష
**సామాన్యులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**ఢిల్లీ, మహా:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై, సామాన్యుడి జీవనంపై ఈ పరిణామాలు పెను ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ చౌహాన్, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, జేడీ నడ్డా, పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్, రామ్మోహన్ నాయుడు, హర్దీప్ సింగ్ పురీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ సహా పలుశాఖల కీలక అధికారులు ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మిగతా 2లో


టాప్ న్యూస్

ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు
- అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా...



02

25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా...
- సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ



02

సగం సినిమా తెలుగులో... సగం సినిమా హిందీలో...
- హైదరాబాదులో ధురంధర్2 రసాభాస



02

# ఏప్రిల్‌లో పరిషత్ ఎన్నికలు?



## ఏప్రిల్ 10 తర్వాత నిర్వహించే అవకాశం
## నెలాఖరుతో ముగియనున్న అసెంబ్లీ
ఏప్రిల్ 4తో పది పరీక్షలు పూర్తి.. ఏప్రిల్ 9తో మూడు రాష్ట్రాల ఎన్నికలు పూర్తి
మే 11 నుండి జనగణన.. ఈ మధ్యలోనే పూర్తికానున్న ఎన్నికలు
రైతుభరోసా విడుదల చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్

**హైదరాబాద్, మహా:**
రాష్ట్రంలో పరిషత్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఆదివారం సిద్ధిపేట వేదికగా రైతుభరోసా విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. 45రోజుల్లోగా రైతులందరికీ భరోసా పడుతుందని ప్రకటించారు. తొలివిడతగా ఎకరం లోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో సోమవారం రూ.3,600కోట్లు జమకానున్నాయి. ఈ ప్రక్రియ ప్రారంభం కావడంతో క్షేత్రస్థాయిలో రైతుల్లో ఉత్సాహం వ్యక్తం అవుతుందని, యూరియా సమస్యలేదని, సన్నవడ్లకు బోనస్ అందించామని రైతు అనుకూల నిర్ణయాలతో క్షేత్రంలో సానుకూల పరిస్థితి ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్, పార్టీ ముఖ్యనేతలతో దీనిపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరుతో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియనుండగా, ఏప్రిల్ 4తో పది పరీక్షలు ముగియనున్నాయి. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి కీలకమైన కేరళ, పుదుచ్చేరి ఎన్నికలు ఏప్రిల్ 9నే ముగియనున్నాయి. ముఖ్యనేతలు ప్రచారానికి వెళ్ళినా ఆలోగానే పూర్తిచేయనున్నారు. పరీక్షలు, అసెంబ్లీ, కీలక ఎన్నికలు పూర్తి అవుతుండడంతో జనగణన ప్రారంభానికి ముందే పరిషత్ ఎన్నికలు పూర్తిచేయాలని సీఎం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మిగతా 2లో



హైదరాబాద్‌ను మించేలా
## అమరావతి నిర్మాణం
**ఏపీ సీఎం చంద్రబాబు**


**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. ఏఐ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. మిగతా 2లో




పెబ్బేరు సంతపై ఈగ వాలనివ్వకుండా
## చూసుకునే బాధ్యత నాది
- గంజాయి మొక్కతోనే వనపర్తికి సమస్యలు
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫైర్

**వనపర్తి, మహా:** పెబ్బేరు సంత వివాదం దేవాదాయ శాఖకు పూజారులకు మధ్య నడుస్తోందని, పెబ్బేరుసంతను కాపాడే బాధ్యత తనదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు శివసేన రెడ్డి గారితో కలిసి ఆయన మాట్లాడారు. వనపర్తి చరిత్రలో సురవరం నుంచి చిన్నారెడ్డి వరకు ఎమ్మెల్యేలంతా తులసి మొక్కలుగా పూజింపబడితే పదేళ్ల నియంత పాలన చేసిన ఒకే ఒక్కడు నిరంజన్ రెడ్డి మాత్రం గంజాయి మొక్కల తయారయ్యాడని విమర్శించారు. అలాంటి గంజాయి మొక్కను పీకి అవతల పడేయాలని వనపర్తిని కాపాడుకుందాం మిగతా 2లో

# సిద్దిపేట నుండి గెలిచిన వారికి మినిస్టర్
**కాంగ్రెస్ నేతలకు రేవంత్ రెడ్డి బంపర్ ఆఫర్**
వచ్చే ఎన్నికల్లో గెలవాలని దిశానిర్దేశం
ఒక్క కుటుంబమే దశాబ్దాలు ఉండాల్నా అని ప్రశ్న
సిద్దిపేట వేదికగా రైతుభరోసా నిధులు విడుదల
సిద్దిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం



**సిద్ధిపేట, మహా :** ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన విడుదల చేశారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. సిద్ధిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన సభలో తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం అన్నదాతల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. మిగతా 2లో

## కేడర్‌లో కొత్త జోష్..
- పీసీసీ అధ్యక్షుడి జిల్లా పర్యటనలకు శ్రీకారం
- గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టత.. భవిష్యత్ ఎన్నికల దిశగా పీసీసీ వ్యూహం
- ప్రభుత్వ పథకాలే అస్త్రంగా మహేష్ కుమార్ గౌడ్ జిల్లాల బాట
- జిల్లాకో సమీక్ష.. సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణ

02

## కల్తీ పాల మృత్యుఘోష
తూర్పుగోదావరి జిల్లాలో 16కు చేరిన మృతుల సంఖ్య
ముమ్మరంగా దర్యాప్తు
వివరాలు 2లో

## దాయాది దేశపు వింతైన బెదిరింపు
- అమెరికా గురిపెడితే భారత్‌పై ప్రతీకారమా?
- పాక్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ సంచలన వ్యాఖ్యలు
- పాకిస్తాన్ దౌత్యపరమైన దివాలాకోరుతనానికి నిలువెత్తు నిదర్శనం
- అబ్దుల్ బాసిత్ అహేతుక ప్రకటన వెనుక ఉన్న అసలు కుట్ర ఇదే!
- అగ్రరాజ్యం దండెత్తితే అణ్వాయుధాలతో అడ్డుకునే కుటిల యత్నం

03







సాహిత్యం 4లో

రియల్ లైఫ్ జేమ్స్ బాండ్
# అజిత్ దోవల్
**ప్రపంచాన్ని విస్మయపరిచిన భారత గూఢచారి!**



(మహా ప్రత్యేకం)

గూఢచర్యం అంటే కేవలం తుపాకులు పట్టుకుని శత్రువులను కాల్చేయడం కాదు. కనురెప్ప పాటు ఏమరుపాటు జరిగినా, నోటి నుంచి పొరపాటున ఏ ఒక్క మాట జారినా.. మరుసటి క్షణం ప్రాణాలు గాలిలో కలిసిపోయే అత్యంత ప్రమాదకరమైన మృత్యు క్రీడ. శత్రువు గుండెల్లో ఉంటూనే వాళ్ల రక్తనాళాల్లో ప్రవహించే ప్రతి ఆలోచనను పసిగట్టగలిగిన నాడీ వ్యవస్థే నిజమైన గూఢచారి. సరిగ్గా ఇలాంటి ఒక నెత్తురు చుక్క కూడా చిందించని సంచలన యుద్ధాన్ని పాకిస్థాన్ గడ్డపై ఏడేళ్ల పాటు ఒంటరిగా పోరాడిన ఒక అదృశ్య యోధుడి కథ ఇది. ఆయనే నేటి భారత జాతీయ భద్రతా సలహాదారు, అపర చాణక్యుడు అజిత్ దోవల్. సమయం 1970వ దశకం ఆఖరి రోజులు. భారతదేశం పోఖ్రాన్ ఎడారిలో అణు పరీక్షలు నిర్వహించి ప్రపంచాన్ని నివ్వెరపరిచిన వేళ, సరిహద్దు అవతల పాకిస్థాన్‌లో ప్రతీకార జ్వాలలు రగులుకుంటున్నాయి. ఎలాగైనా సరే ఇస్లామిక్ ప్రపంచంలో తొలి అణు బాంబును తయారు చేసి భారత్‌పై పైచేయి సాధించాలనే ఉన్మాదంతో పాక్ సైన్యం పాకులాడుతోంది. ఇస్లామాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న కహూటా ప్రాంతాన్ని ఎంచుకుని, ప్రపంచ దేశాల కళ్లు గప్పి అత్యంత రహస్యంగా భూగర్భంలో అణు కర్మాగారాన్ని నిర్మించడం మిగతా 2లో

## 25న కాంగ్రెస్ కు రాజీనామా చేస్తా..

**జగిత్యాల, మహా :** కాంగ్రెస్‌లో కొనసాగలేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగ లేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలి' అని కార్యకర్తలను కోరారు.

## సగం సినిమా తెలుగులో సగం సినిమా హిందీలో

### హైదరాబాదులో ధురంధర్-2 రసాభాస

**హైదరాబాద్ సిటీ, మహా:** హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ మల్టీప్లెక్స్‌లో బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' సినిమా ప్రదర్శన సందర్భంగా తీవ్ర గందరగోళం నెలకొంది. పంజాగుట్టలోని నెక్స్ట్ గల్లేరియా మాల్‌లో ఉన్న పీవీఆర్ థియేటర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒకే స్క్రీన్‌కు హిందీ, తెలుగు వెర్షన్ల టికెట్లను విక్రయించడమే ఈ రచ్చకు కారణంగా నిలిచింది. సినిమా ప్రదర్శన మధ్యలో యాడ్స్ వస్తున్న సమయంలో స్క్రీనింగ్‌ను నిలిపివేశారు. దీంతో హిందీ, తెలుగు టికెట్లు కొనుగోలు చేసిన ప్రేక్షకులు ఒకరితో ఒకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు. 'మేము తెలుగు వెర్షన్ టికెట్లు ముందుగా బుక్ చేసుకున్నాం' అని ఓ మహిళ గట్టిగా నిలదీయగా, మరికొందరు మేం హిందీ వెర్షన్ కు టికెట్లు కొన్నాం... మెట్లపై కూర్చునే సినిమా చూస్తామంటూ ఆందోళనకు దిగారు. దీంతో థియేటర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు థియేటర్ సిబ్బంది, పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. సుదీర్ఘ చర్చల తర్వాత యాజమాన్యం హిందీ వెర్షన్‌ను ప్రదర్శించాలని నిర్ణయించింది. దీంతో తెలుగు టికెట్లు కొన్న ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ గొడవకు సంబంధించిన దృశ్యాలను ఓ నెటిజన్ వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా, అది కాస్తా వైరల్‌గా మారింది.

## ప్రధాని మోదీ మరో అరుదైన రికార్డు

### అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా

**ఢిల్లీ, మహా:** ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మనదేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా వ్యవహరించిన రికార్డును ప్రధాని మోదీ ఆదివారం రోజు సొంతం చేసుకున్నారు. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు. సీఎంగా 8,930 రోజుల పాటు సేవలను అందించిన రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. మార్చి 22 నాటికి గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకున్నారు. దీంతో పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలైంది.

## పెబ్బేరు సంతపై ఈగ వాలనివ్వకుండా చూసుకునే బాధ్యత నాది

- గంజాయి మొక్కతోనే వనపర్తికి సమస్యలు
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఫైర్

(మొదటిపేజీ తరువాయి)

వనపర్తిని మార్చుకుందామని 2023 లో జరిగిన ఎన్నికల్లో ప్రజలను కోరితే పీకి అవతల పారేశారని, ఎమ్మెల్యే ఎంపీ గ్రామ సర్పంచ్ మున్సిపల్ కౌన్సిలర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజారిటీ సాధించిందని ఆ రిజల్ట్స్ తో మైండ్ దొబ్బి కొంతమంది పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని అలాంటి మాటలు తమకు కూడా మాట్లాడడానికి వచ్చని, తాము కూడా వనపర్తి గడ్డపైనే పుట్టామన్నారు. వంద సంవత్సరాలుగా వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన ఈనామ్ భూమి అని అందరికీ తెలుసునని అప్పటినుంచి ఇప్పటివరకు పెబ్బేరు సంత ప్రశాంతంగా కొనసాగిందన్నారు. 1973 లో ఒక ప్రొసీడింగ్ వచ్చిందని 392 సర్వే నెంబర్లు 15 ఎకరాలు, సర్వేనెంబర్ 405 లో 15 ఎకరాల భూమి మొత్తం 30 ఎకరాల 19 గుంటలు వేణుగోపాల స్వామి దేవుడిపై ఆయన దూపదీప నైవేద్యాల కోసం కేటాయించబడి ఉన్నదని, ఆ గుడి ద్వారా వచ్చే ఆదాయంతో పూజారులు వాళ్ళ జీవనాన్ని కొనసాగించేందుకు కేటాయించారు అని తెలియశారని, ఈ భూమికి సంబంధించి మహబూబ్ నగర్, గద్వాల ఆర్డీవోలు సైతం ఈ భూమి పూర్తిగా వేణు గోపాల స్వామి ఆలయానికి సంబంధించింది అని సూచిస్తూ ప్రభుత్వ పరమైన ప్రొసిడింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పెబ్బేరు సంత 2014 వరకు ఎంతో ప్రశాంతంగా కొనసాగిందని..100 సంవత్సరాలుగా ప్రశాంతంగా ఉన్న ఆ సంతస్థలం ఈ గంజాయి మొక్క కు ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ పదవి రాగానే వివాదాస్పదంగా మార్చారని మేఘారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పెబ్బేరు సంతను కాపాడుతామన్నారు.

# సిద్దిపేట నుండి గెలిచిన వారికి మినిస్టర్

(మొదటిపేజీ తరువాయి)

ఇరవై రోజుల అనంతరం రెండో విడతలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా.. రైతుల విషయంలో వెనుకంజ వేయడం లేదన్నారు. ''వరికి బోనస్ ఇస్తున్నాం. వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నాం. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఆ జిల్లాలో పంటల సాగు తగ్గింది. కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోంది. పంటమార్పిడి ద్వారా మాత్రమే.. వ్యవసాయం లాభసాటి అవుతుంది.

**అంకాపూర్‌ను ఆదర్శంగా తీసుకోండి**

సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా.. ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి.. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించాం. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నాం. ఒకప్పుడు సౌరవిద్యుత్ వ్యాపారం అంబానీ, అదానీ వంటివారు చేసేవారు.



ఈ ప్రభుత్వం మహిళలతో సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు.. ఉదయం టిఫిన్ కూడా పెడుతున్నాం.

**సిద్దిపేటలో గెలిచిన వారికి మంత్రి పదవి**

పశ్చిమాసియాలో యుద్ధం వల్ల మనకు రాబోయే రోజుల్లో యూరియా కొరత వచ్చేలా ఉంది. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా భాజపా ఎంపీలు సహకరించాలి. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేద్దాం. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలి. ప్రత్యర్థి పార్టీ నేతల గురించి ఆలోచిస్తే.. ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు ఇచ్చే నిధుల విషయంలో వివక్షచూపే సీఎంను కాదు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తా. గత పాలకులు విపక్షనేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ, ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్దిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చాను. వివక్ష చూపే వ్యక్తినయితే.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడిని. ప్రజలు బీఆర్ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చారు.. మాకు రెండు సార్లు ఇస్తారు.'' అని రేవంత్ అన్నారు.

**ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం**

అంతకుముందు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 62 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రూ.300 కోట్లతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు. మరోవైపు రూ.80 కోట్లతో నర్మెటలో పామాయిల్ రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

# ఏప్రిల్‌లో పరిషత్ ఎన్నికలు?

(మొదటిపేజీ తరువాయి)

గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను హస్తగతం చేసుకుని సత్తా చాటిన అధికార కాంగ్రెస్ పార్టీ ఇదే అదునుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను కూడా పూర్తి చేసి రాజకీయంగా ప్రయోజనం పొందాలని డిసైడైంది. మునిసిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లకు మించి స్థానాలు దక్కగా, పరిషత్ ఎన్నికల్లోనూ పార్టీపరంగా రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తోంది. ఓ వైపు కేంద్రంతో కొట్లాడుతూనే స్థానిక పాలకవర్గాల కోసం ఎన్నికల క్రతువు పూర్తి చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రైతు భరోసా నిధులను మున్సిపల్ ఎన్నికలు పూర్తి కాగానే రైతుల ఖాతాల్లో వేస్తామని స్వయంగా ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి మాట నిలుపుకోగా, అధికారయంత్రాంగం ఇప్పటికే ఎన్నికలకు సంబంధించిన అన్నిరకాల శిక్షణలు పూర్తిచేసుకుని రెడీగా ఉంది.

**565 జడ్పీటీసీలు.. 31 జిల్లా పరిషత్ లు**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ..జిల్లా ప్రజా పరిషత్‌లు (జెడ్పీపీలు) 31, జెడ్పీటీసీ స్థానాలు 565 , మండల ప్రజాపరిషత్‌లు 565, ఎంపీటీసీ స్థానాలు 5,763, గ్రామపంచాయతీలు- 12,760, వార్డుల సంఖ్య 1,12,534 గా ఖరారు అయ్యాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు 570, ఎంపీటీసీలు 5,817, గ్రామపంచాయతీలు 12,848గా ఉన్నాయి. ఇప్పుడు 1 జెడ్పీపీ, 5 జెడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 54 ఎంపీటీసీ స్థానాలు, 185 గ్రామ పంచాయతీలు తగ్గాయి. మేడ్చల్-మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది. ఒక జెడ్పీపీ, 4 జెడ్పీటీసీల సంఖ్య తగ్గుదలకు ఇది కారణంగా నిలుస్తోంది. మునిసిపల్ ఎన్నికలతో ఊపుమీదున్న కాంగ్రెస్ పరిషత్ పోరుతో మరింత పట్టు బిగించనుంది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీ ఉన్నతస్థాయి సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య రగులుతున్న తాజా వివాదాలు, ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా జరిగే షిప్‌మెంట్లపై తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ పరిణామాలు గ్లోబల్ క్రూడాయిల్, ఎల్ఎన్జీ మార్కెట్లను ఒక్కసారిగా కుదిపేస్తున్నాయి. ఈ సున్నితమైన ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన ప్రధాని మోదీ, ఇంధన మార్కెట్లో వస్తున్న ఆకస్మిక, ప్రమాదకర మార్పులను అనుక్షణం రాడార్‌తో స్కాన్ చేసినట్లు గమనించాలని ఇంధన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని ఆదేశించారు. ముడి చమురు ధరల్లో ఆకస్మిక పెరుగుదల, ఎల్పీజీ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే.. దేశంలో ఇంధన కొరత లేకుండా చూడటానికి ప్రత్యామ్నాయ వ్యూహాలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా పెట్రోలియం కంపెనీలు వాణిజ్య అవసరాల కంటే గృహ అవసరాలకే (డొమెస్టిక్ గ్యాస్) పెద్దపీట వేయాలని స్పష్టమైన సంకేతాలు వెళ్లాయి. అంతర్జాతీయంగా మారుతున్న సమీకరణాలను, ముఖ్యంగా గల్ఫ్ దేశాలతో ఉన్న దౌత్య సంబంధాలను మనకు అనుకూలంగా ఎలా మలుచుకోవాలనే అంశంపై విదేశాంగ మంత్రి జైశంకర్ ఈ భేటీలో కీలక దౌత్యపరమైన బ్లూప్రింట్ ను అందించారు. ఇంధన ధరల భయం మార్కెట్‌లోకి ప్రవేశిస్తే, ఆటోమేటిక్‌గా రవాణా ఖర్చులు పెరిగి ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. కృత్రిమ కొరత సృష్టించి సామాన్యుడి రక్తం తాగే బ్లాక్ మార్కెట్ ముఠాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల కోసమే కాచుకు కూర్చుంటాయి. ఈ పెను ప్రమాదాన్ని మొగ్గలోనే తుంచేయడానికి అమిత్ షా ఆధ్వర్యంలో కేంద్రం అత్యంత కఠినమైన చర్యలకు ఉపక్రమించింది. దేశీయ మార్కెట్లలో ఎక్కడా కూడా వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్, ఆహార ధాన్యాల కొరత లేకుండా చూడటానికి పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రజల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పానిక్ బయింగ్ (భయంతో వస్తువులను ఎగబడి కొనుగోలు చేయడం) తలెత్తకుండా చూడటం ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యంగా నిర్ణయించారు. అవసరమైతే నిత్యావసర వస్తువుల చట్టాన్ని అస్త్రంగా ప్రయోగించి, అక్రమ నిల్వలకు, పంపిణీ మళ్లింపులకు పాల్పడే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా రాష్ట్రాల అధికార యంత్రాంగాలకు స్పష్టమైన సంకేతాలు పంపారు.

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు. ''ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. ఢిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం. అని అన్నారు.

**జినోమ్ వ్యాలీ నా కృషి**

19992004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్



వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ ఎలా ఉందో చూస్తున్నాం. విద్యుత్ సమస్యలను అధిగమించి మిగులు వరకు తీసుకొచ్చాం. సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. గ్రీన్ ఎనర్జీరంగంలో దక్షిణాదిలో మేమే నెంబర్‌వన్ '' అని చంద్రబాబు అన్నారు.

# కల్తీ పాల మృత్యుఘోష

**హైదరాబాద్, మహా:** ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో కల్తీ పాలు సృష్టించిన మృత్యుఘోష దడ పుట్టిస్తోంది. స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్న ఈ కల్తీ పాల వ్యవహారంలో మృతుల సంఖ్య తాజాగా 16కు చేరినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. మరో ముగ్గురు వ్యక్తులు రాజమహేంద్రవరంలోని ఆసుపత్రులలో చావుబతుకుల మధ్య పోరాడుతూ చికిత్స పొందుతున్నారు. ఫిబ్రవరి మధ్యలో రాజమహేంద్రవరం పరిధిలోని లాలాచెరువు ప్రాంతంలో సరఫరా అయిన పాలు తాగిన వినియోగదారులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. బాధితుల్లో వాంతులు, కడుపునొప్పి, మూత్రం నిలిచిపోవడం (అనూరియా), తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యం (అక్యూట్ రీనల్ డిస్ఫంక్షన్) వంటి లక్షణాలు కనిపించడంతో పలువురిని హుటాహుటిన ఆసుపత్రులలో చేర్చారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించింది. రోగులకు మెరుగైన, అత్యుత్తమ వైద్య సేవలు అందించడం కోసం హైదరాబాద్ నుంచి సీనియర్ వైద్యాధికారులు, నిపుణులైన స్పెషలిస్ట్ డాక్టర్ల బృందాలను డిప్యుటేషన్‌పై పంపించారు. వివిధ ఆసుపత్రులలో రోగులకు అందుతున్న చికిత్సా విధానాలను ఈ బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, స్థానిక వైద్యులతో సమన్వయం చేసుకుంటూ బాధితులు ప్రాణాపాయం నుంచి త్వరగా కోలుకునేలా కీలక చర్యలు తీసుకుంటున్నాయి. మరోవైపు, ఈ దారుణ ఘటనపై పోలీసు, ఆహార భద్రతా విభాగాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి. కల్తీ పాల కారణంగా మృతి చెందిన ఒక మహిళ కుమారుడు తాడి సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఫిబ్రవరి 22న పోలీసులు బి.ఎన్.ఎస్.ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేశారు. అనుమానిత పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందాలు డెయిరీ ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కీలక ఆధారాలను సేకరించాయి. ఆహార భద్రతా అధికారులు సైతం అనుమానిత డెయిరీ యూనిట్‌ను తనిఖీ చేసి పాలు, పెరుగు, నెయ్యి, పనీర్, నీరు తదితర నమూనాలను సేకరించి.. సూక్ష్మజీవ, రసాయన విశ్లేషణల నిమిత్తం ప్రయోగశాలలకు పంపించారు. వీటితో పాటు, పశుసంవర్థక శాఖకు చెందిన ప్రత్యేక బృందాలు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి పాలు, పశువుల దాణా, త్రాగునీటికి సంబంధించిన అదనపు నమూనాలను సేకరించాయి. ఈ నమూనాలలో ఎలాంటి విషపూరితమైన లేదా బాహ్య కలుషితాలు ఏమైనా ఉన్నాయో నిర్ధారించడానికి వాటిని టాక్సికలాజికల్ విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌లకు పంపించారు. అయితే, ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, పరిస్థితులన్నీ పూర్తి నియంత్రణలోనే ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రయోగశాలల నుంచి వచ్చే సమగ్ర నివేదికలు, దర్యాప్తు తుది ఫలితాల ఆధారంగానే తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# రియల్ లైఫ్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్


## ప్రపంచాన్ని విస్మయపరిచిన భారత గూఢచారి!

(మొదటిపేజీ తరువాయి)

మొదలుపెట్టింది. ఆ కర్మాగారం చుట్టూ భద్రత ఎలా ఉందంటే.. అణువంత అనుమానం వచ్చినా వందల కొద్దీ తూటాలు శరీరంలోకి దిగిపోయేంత పకడ్బందీగా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ కుట్రను పసిగట్టిన న్యూఢిల్లీకి, కహూటా లోపల ఏం జరుగుతుందో తెలుసుకోవడం ప్రాణసంకటంగా మారింది. ఆ సమయంలో భారత ఇంటెలిజెన్స్ బ్యూరో కళ్లు ఒక చురుకైన యువ అధికారి మీద పడ్డాయి. అతనే ఈ మృత్యు శాసనాన్ని జయించగలడని నమ్మి, పాకిస్థాన్‌లోకి పంపింది.

సరిహద్దులు దాటి పాకిస్థాన్‌లోకి అడుగుపెట్టిన ఆ యువ అధికారి, తన గుర్తింపును పూర్తిగా చెరిపేశాడు. తన మతాన్ని, తన భాషను, తన వేషధారణను సమూలంగా మార్చుకున్నాడు. పక్కా ఉర్దూ యాసలో మాట్లాడుతూ, స్థానికుల్లో ఒకడిగా కలిసిపోయాడు. ఇస్లామాబాద్, లాహోర్ వీధుల్లో చిరిగిన బట్టలతో, మాసిన గడ్డంతో, దయనీయమైన స్థితిలో ఉన్న ఒక అభాగ్యుడిగా తిరుగుతూ శత్రు దేశపు నాడిని పట్టుకున్నాడు. తన చుట్టూ పాకిస్థాన్ నిఘా సంస్థల కళ్లు అడుగడుగునా కాపలా ఉన్నా, ఆ చిరిగిన బట్టల వెనుక ఉన్నది భారతమాత ముద్దుబిడ్డ అని ఏ ఒక్కరికీ అనుమానం రానివ్వకుండా ఏడేళ్ల పాటు నటించిన తీరు బహుశా హాలీవుడ్ థ్రిల్లర్ సినిమాలకు కూడా అందదు.

ఈ అజ్ఞాతవాసంలో ఒకరోజు ఆయన ఎదుర్కొన్న ప్రాణగండం అంతా ఇంతా కాదు. లాహోర్‌లోని దాతా దర్బార్ ప్రాంతంలో ఆయన వెళుతుండగా, ఒక మూలన కూర్చున్న తెల్లటి గడ్డం ఉన్న వృద్ధుడు



ఆయనను నిశితంగా గమనించాడు. దోవల్ చెవులకు ఉన్న చిన్న కుట్లు (రంధ్రాలు) చూసిన ఆ వృద్ధుడు, "నువ్వు ముస్లింవి కాదు, హిందువువి కదా" అని ఒకే ఒక్క మాటతో గర్జించాడు. ఆ ఒక్క క్షణం.. దోవల్ గుండె ఆగినంత పనైంది. ఏమాత్రం తొట్రుపాటు పడినా అక్కడికక్కడే ప్రాణాలు పోతాయి. కానీ ఆ అపర చాణక్యుడు ఏమాత్రం బెదరలేదు. తన బుద్ధిబలాన్ని పదునుపెట్టి, తాను పుట్టుకతో హిందువునైనా, తరువాత మతం మార్చుకున్నానని అత్యంత నమ్మశక్యంగా బదులిచ్చాడు. ఆ క్షణంలో తనను తాను కాపాడుకోవడమే కాదు, ఏకంగా ఆ వృద్ధుడితోనే స్నేహం చేసి పాక్ వీధుల్లో మరింత సురక్షితంగా తిరిగేలా పావులు కదిపాడు.

ఇక అసలు మిషన్ కహూటా అణు కేంద్రం! ఆ అణు కేంద్రంలోకి చొరబడటం అసాధ్యం అని తెలుసుకున్న దోవల్, ఒక వినూత్నమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. అణు శాస్త్రవేత్తలు బయటకు వచ్చే దారులు, వాళ్లు వెళ్లే ప్రదేశాలపై డేగ కన్ను వేశాడు. ఆ కహూటా శాస్త్రవేత్తలు తరచూ క్షవరం కోసం వచ్చే ఒక సామాన్యమైన సెలూన్ షాపును ఆయన గుర్తించారు. అత్యంత చాకచక్యంగా ఆ సెలూన్ నుంచి వారు కత్తిరించిన వెంట్రుకలను సేకరించి, దౌత్య మార్గాల ద్వారా అత్యంత రహస్యంగా న్యూఢిల్లీలోని ల్యాబ్‌లకు పంపించారు. ఆ వెంట్రుకలను పరీక్షించిన భారత శాస్త్రవేత్తలు నివ్వెరపోయారు. వాటిలో రేడియేషన్, యురేనియం ఐసోటోపుల ఆనవాళ్లు స్పష్టంగా కనిపించాయి. అంతే! పాకిస్థాన్ అణు బాంబు తయారు చేస్తోందన్న పక్కా ఆధారాలు భారత నిఘా సంస్థల చేతికి చిక్కాయి.

ఈ ఒక్క ఆధారంతో భారతదేశం అప్రమత్తమైంది. అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్థాన్ కుట్రలను బట్టబయలు చేసింది. పాకిస్థాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బకొట్టి, దశాబ్దాల పాటు వారి ప్రణాళికలను వెనక్కి నెట్టడంలో ఈ సమాచారం బ్రహ్మాస్త్రంలా పనిచేసింది. ఏడేళ్ల పాటు సొంత గడ్డకు, కుటుంబానికి దూరంగా.. ప్రతి నిమిషం మృత్యువుతో దోబూచులాడుతూ దేశం కోసం అహర్నిశలు శ్రమించిన అజిత్ దోవల్ ఒక నిశ్శబ్ద అగ్నిపర్వతం. గూఢచర్య ప్రపంచంలో ఆయన వేసిన ప్రతి అడుగు రాబోయే తరాలకు ఒక పాఠం. ఎలాంటి పతకాలు, కీర్తి ప్రతిష్టలు ఆశించకుండా శత్రు దేశపు గుండెల్లో భారత జెండాను అదృశ్య రూపంలో పాతిన ఆ అసలైన జేమ్స్ బాండ్.. చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ధీరోదాత్తుడు.

# కేడర్‌లో కొత్త జోష్..

- పీసీసీ అధ్యక్షుడి జిల్లా పర్యటనలకు శ్రీకారం
- గ్రామస్థాయి నుంచి పార్టీ పటిష్టత.. భవిష్యత్ ఎన్నికల దిశగా పీసీసీ వ్యూహం
- ప్రభుత్వ పథకాలే అస్త్రంగా మహేష్ కుమార్ గౌడ్ జిల్లాల బాట
- జిల్లాకో సమీక్ష.. సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సంచలన అడుగు వేశారు. ఇటీవల నూతన డీసీసీ కమిటీలను ప్రకటించి పార్టీలో కొత్త ఉత్సాహాన్ని నింపిన ఆయన, ఇప్పుడు నేరుగా జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, పార్టీ నిర్మాణాన్ని పునాదుల స్థాయి నుంచి పటిష్టం చేయడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటనలకు రూపకల్పన చేశారు. ఈ టూర్‌లో భాగంగా ప్రతి జిల్లాలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన స్వయంగా ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నారు. స్థానిక సమస్యలను కూలంకషంగా తెలుసుకోవడంతో పాటు, ఆయా జిల్లాల్లో పార్టీ తాజా పరిస్థితులపై లోతైన సమీక్షలు చేయనున్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి జిల్లా స్థాయి నాయకుడి వరకు అందరినీ సమన్వయం చేసుకుంటూ, భవిష్యత్తు ఎన్నికలకు పార్టీని సర్వసన్నద్ధం చేసేలా వ్యూహరచన చేస్తున్నా



రు. మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు నేరుగా, సమగ్రంగా చేరవేసే భారీ బాధ్యతను కూడా ఆయన భుజాన వేసుకున్నారు. ప్రభుత్వ పనితీరును, సాధించిన విజయాలను ప్రజలకు వివరించడం ద్వారా వారిలో కాంగ్రెస్ పార్టీ పట్ల ఉన్న విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా కార్యాచరణ రూపొందించారు.

# దాయాది దేశపు వింతైన బెదిరింపు

## అమెరికా గురిపెడితే భారత్‌పై ప్రతీకారమా?

- పాక్ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ సంచలన వ్యాఖ్యలు
- పాకిస్తాన్ దౌత్యపరమైన దివాలాకోరుతనానికి నిలువెత్తు నిదర్శనం
- అబ్దుల్ బాసిత్ అహేతుక ప్రకటన వెనుక ఉన్న అసలు కుట్ర ఇదే!
- అగ్రరాజ్యం దండెత్తితే అణ్వాయుధాలతో అడ్డుకునే కుటిల యత్నం

**ఢిల్లీ, మహా:** పాకిస్తాన్ నాయకులు, దౌత్యవేత్తలు భారత్‌పై తమకున్న గుడ్డి ద్వేషాన్ని, తీవ్రమైన అభద్రతాభావాన్ని మరోమారు ప్రపంచం ముందు బహిర్గతం చేశారు. అంతర్జాతీయ దౌత్య నీతికి, కనీస తర్కానికి ఏమాత్రం పొంతన లేని విధంగా పాకిస్తాన్ మాజీ హైకమిషనర్ అబ్దుల్ బాసిత్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. "ఒకవేళ అమెరికా గనక మాపై దాడికి దిగితే, మేము దానికి ప్రతికార్యంగా నేరుగా భారత్‌పైనే దాడికి పాల్పడతాం" అని ఆయన ఓ బహిరంగ వేదికపై చేసిన హెచ్చరిక దాయాది దేశపు అపరిపక్వ, ఉన్మాదపూరిత విదేశీ విధానాన్ని బట్టబయలు చేస్తోంది. ఎక్కడో ఏడు సముద్రాల ఆవల ఉన్న అగ్రరాజ్యం అమెరికా తమపై సైనిక చర్యకు ఉపక్రమిస్తే, పక్కనే ఉన్న పొరుగు దేశం భారత్‌పై ప్రతీకారం తీర్చుకుంటామనడం వెనుక ఉన్న తర్కం ఏంటో ప్రపంచ దౌత్య నిపుణులకు సైతం అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయింది.

గతంలో భారత్‌లో పాకిస్తాన్ తరపున హైకమిషనర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి అబ్దుల్ బాసిత్. అత్యంత కీలకమైన దౌత్యపరమైన వ్యవహారాలపై పూర్తి అవగాహన, బాధ్యత ఉండాల్సిన స్థాయి వ్యక్తి.. ఇలాంటి రెచ్చగొట్టే, బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం పాకిస్తాన్ అంతర్గత రాజకీయ, సైనిక వర్గాలలో నెలకొన్న తీవ్ర నిరాశను, గందరగోళాన్ని సూచిస్తోంది. సాధారణంగా ఏ దేశమైనా తమపై వేరొక దేశం ఆక్రమణకో, దాడికో దిగితే, ఆ దాడిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు లేదా శత్రు దేశంపైనే నేరుగా ప్రతిదాడి చేసేందుకు వ్యూహాలు రచిస్తుంది. కానీ, పాకిస్తాన్ మాత్రం తమకు ఎదురయ్యే ప్రతి అంతర్జాతీయ సమస్యకూ, సంక్షోభానికీ భారత్‌ను ముడిపెట్టడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే విఫల ప్రయత్నం చేస్తోందని ఈ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. ఇది వారి మానసిక రుగ్మతకు, దౌత్యపరమైన దివాలాకోరుతనానికి పరాకాష్ట అని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అయితే, ఈ సంచలన వ్యాఖ్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం భారత్‌ను బెదిరించడం కంటే, అణ్వాయుధాలను అడ్డుపెట్టుకుని అంతర్జాతీయ సమాజాన్ని బ్లాక్‌మెయిల్ చేయడమేనని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పాకిస్తాన్ ఎప్పుడూ తన అణ్వాయుధ సామర్థ్యాన్ని చూపి ప్రపంచ దేశాలను భయపెట్టే "మ్యాడ్‌మ్యాన్ థియరీ" (పిచ్చివాడి వ్యూహం)ని అవలంబిస్తూ ఉంటుంది. ఒకవేళ తమ దేశంలో వేళ్లూనుకున్న ఉగ్రవాద స్థావరాలపై అమెరికా లేదా ఇతర పశ్చిమ దేశాలు ఏదైనా సైనిక చర్యకు ఉపక్రమిస్తే, ఆ పరిణామాలు దక్షిణాసియాలో రెండు అణు దేశాల (భారత్‌పాకిస్తాన్) మధ్య ముఖాముఖి యుద్ధానికి, తద్వారా భారీ విధ్వంసానికి దారితీస్తాయనే భయాన్ని సృష్టించడమే అబ్దుల్ బాసిత్ తాజా వ్యాఖ్యల పరమార్థంగా కనిపిస్తోంది. అంటే, తమపైకి రాబోయే ముప్పును తప్పించుకోవడానికి యావత్ దక్షిణాసియా శాంతి భద్రతలను పణంగా పెడతామని పాకిస్తాన్ పరోక్షంగా అగ్రరాజ్యాలను హెచ్చరిస్తోంది.

మరోవైపు, భారత రక్షణ వ్యవస్థను, మన సైనిక దళాల అద్భుతమైన సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేస్తూ పాకిస్తాన్ నేతలు చేసే ఇలాంటి ప్రగల్భాలు మనకు కొత్తేమీ కాదు. ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా పెంచి పోషిస్తూ అంతర్జాతీయంగా ఏకాకిగా మారిన పాకిస్తాన్, ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో, రాజకీయ అస్థిరతలో కూరుకుపోయి ఉంది. తినడానికి తిండి లేక తమ దేశ పౌరులు అల్లాడుతున్న ప్రస్తుత విపత్కర తరుణంలో, ప్రజల దృష్టిని మళ్లించి వారిలో జాతీయవాదాన్ని రగిల్చేందుకే పాలకులు ఇటువంటి ఉన్మాదపూరిత, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని స్పష్టమవుతోంది. ఏదేమైనప్పటికీ, ఒక సీనియర్ మాజీ దౌత్యవేత్త నోటివెంట వచ్చిన ఈ విపరీత వ్యాఖ్యలు పాకిస్తాన్ నాయకత్వం ఎంతటి అస్థిరమైన ఆలోచనా విధానంతో ఉందో మరోమారు తేటతెల్లం చేశాయి. ఇలాంటి అర్థరహితమైన బెదిరింపులకు నవ భారతం ఎన్నడూ భయపడదని, తన సార్వభౌమాధికారాన్ని, దేశ భద్రతను కాపాడుకునేందుకు అన్నివేళలా సర్వసన్నద్ధంగా ఉంటుందని ఈ పరిణామం ద్వారా దాయాది దేశం గ్రహించాల్సి ఉంది.

# పేద విద్యార్థులకు ఘనంగా పీపీటీ ప్రవేశ పరీక్ష..

### నల్లగొండ టీఎస్‌యూటీఎఫ్ భవనంలో పరీక్ష నిర్వహణ..

### నిరుపేద ప్రతిభావంతులకు ఉచిత విద్యే లక్ష్యం పెరుమాళ్ళ వెంకటేశం..



**నల్లగొండ, మహా:** నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడమే పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ (PPT) ప్రధాన ఉద్దేశమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం పేర్కొన్నారు. ఆదివారం ఉదయం స్థానిక జిల్లా కేంద్రంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య మార్గదర్శకత్వంలో నడుస్తున్న 'ప్రగతి విద్యా నికేతన్' (హైదరాబాద్) 6, 7 తరగతుల ఉచిత ప్రవేశాల కోసం ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షా పత్రాలను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1995లో హైదరాబాద్ శివారులోని ప్రగతి నగర్‌లో ప్రారంభమైన ఈ ట్రస్ట్ గత మూడు దశాబ్దాలుగా విద్య, వైద్య రంగాల్లో విశేష సేవలందిస్తోందని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులను ఎంపిక చేసి వారికి డిగ్రీ వరకు ఉచితంగా నాణ్యమైన విద్యను వసతిని కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులను స్థిరపడే వరకు భరోసా కల్పిస్తూ.. విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే వరకు అవసరమైన ఆర్థిక వనరులను కూడా ట్రస్ట్ సమకూరుస్తోంది. ఇప్పటికే కొన్ని వందల మంది విద్యార్థులు ఈ సంస్థ ద్వారా ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో స్థిరపడ్డారని వెంకటేశం గుర్తు చేశారు. పేద విద్యార్థులు ఇటువంటి సువర్ణ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు గేర నరసింహ, నలపరాజు వెంకన్న, కొమ్రరాజు సైదులు, సి.హెచ్. రవీందర్, పరీక్షా పర్యవేక్షకులు (ఎగ్జామినర్స్) మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- గుత్తా సుఖేందర్ రెడ్డి
- 48 మంది లబ్ధిదారులకు రూ. 19 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

**నల్గొండ, మహా :** పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోందని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 48 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) ద్వారా మంజూరైన రూ. 19,00,000 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమలవుతున్నాయని కొనియాడారు. ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరమని ఇది ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతోందని ఆయన తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అట్టడుగు వర్గాలకు చేరువవుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. సకాలంలో తమకు ఆర్థిక సాయం అందడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# ఓడి గెలిచా జనం సేవలోనే తరిస్తా..

- పల్ల జ్యోతిక రవికుమార్
- గాంధీనగర్ గుండెల్లో చెరగని ముద్ర ఓడినా వీడని జనం ప్రేమ..
- ఉచిత మెగా వైద్య శిబిరానికి తరలి వచ్చిన 39వ డివిజన్ ప్రజలు..



**నల్గొండ టౌన్, మహా :** మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కేవలం అంకెలే కానీ ప్రజల మనసుల్లో సంపాదించుకున్న స్థానం శాశ్వతం. పదవులు రావచ్చు, పోవచ్చు, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం నా ప్రాణం ఉన్నంత వరకు మరువలేనని 39వ డివిజన్‌లో సింహం గుర్తు పై పోటీ చేసి కొద్ది ఓట్లతో ఓటమి చెందిన పల్ల జ్యోతిక రవి కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యతతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.

**జనం ప్రేమ ముందు ఓటమి చిన్నబోయింది..**

వైద్య శిబిరానికి తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి రవికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో విజయం దక్కకపోయినా ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు చూస్తుంటే తానూ ఎన్నడూ ఓడిపోలేదనే భావన కలుగుతోందని అన్నారు. ఓటమి అనేది కేవలం నా పేరు ముందు చేరిన ఒక పదం మాత్రమే. కానీ 'సేవ' అనేది నా రక్తంలోనే ఉంది. గాంధీనగర్ ప్రజలు నాపై చూపిస్తున్న ఈ గౌరవం, నమ్మకం వెలకట్టలేనివి ఈ ప్రేమను తలుచుకుంటే కళ్లు చెమర్చుతున్నాయి అని ఆయన పేర్కొన్నారు. కష్టకాలంలో తన వెన్నంటి ఉండి ప్రజాసేవలో తనను నడిపిస్తున్న తన కుటుంబ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహం లేకపోతే ఈ స్థాయి సేవ చేయడం సాధ్యపడేది కాదని కొనియాడారు. గెలుపు అంటే కేవలం ఓట్లు రావడం మాత్రమే కాదు, ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం అని ఈ రోజు తనకు అర్థమైందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులే తన మార్గదర్శకాలని నా జీవితాన్ని గాంధీనగర్ డివిజన్ ప్రజల సేవకే అంకితం చేస్తానని ఆయన పునరుద్ఘాటించారు. ఈ హెల్త్ క్యాంప్‌కు విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వైద్య శిబిరంలో వందలాది మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు..



# సాయంత్రం వేళల్లో సేద తీసుకునేలా ఉండాలి

- క్యాతనపల్లిలో చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించిన మంత్రి

**మందమర్రి, మహా :** సాయంత్రం వేళల్లో సేద తీసుకునేలా కుర్మపల్లి, క్యాతనపల్లి చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం క్యాతనపల్లి మున్సిపాలిటీ 10వ వార్డులో 2.09 కోట్ల రూపాయల వ్యయంతో కుర్మపల్లి/క్యాతనపల్లి చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడిందని చెప్పారు. చెరువును అందంగా తీర్చిదిద్ది ఉదయం సాయంకాలం నడకలు, సాయంత్రం వేళల్లో విశ్రాంతి తీసుకునేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా క్యాతనపల్లి మున్సిపాలిటీలో పలు వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని దాని పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిన

# పూలపల్లి వార్డు సభ్యులు



- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన భీమ్ భరత్
- కాంగ్రెస్ ప్రభుత్వం తోనే రాష్ట్ర అభివృద్ధి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని భీమ్ భరత్ అన్నారు. పూలపల్లి గ్రామ పంచాయతీ వార్డ్ మెంబర్లు, భీమ్ భరత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రంగారెడ్డి జిల్లా, నవాబుపేట్ మండలం, పూలపల్లి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో, 4, 5వ వార్డు సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ సమక్షంలో ఆయన చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి, వార్డు సభ్యులను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం భీమ్ భరత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సేవకే అంకితమైందని, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల కోసం ప్రత్యేక చొరవ తీసుకొని అనేక సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మండిపడ్డారు. తెలంగాణలో ప్రజలు కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గానికి న్యాయం చేస్తూ, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.



## తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ ను కలిసిన కలెక్టర్

**మంచిర్యాల, మహా:** తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ ను మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జన్నారం మండల కేంద్రం హరిత హోటల్ కు తన పర్యటనలో భాగంగా వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కలిసినట్లు వెల్లడించారు.

# యాసంగి సీజన్ రైతు భరోసా నిధులు విడుదల

- జిల్లాలోని రైతుల ఖాతాలో నేడు రైతు భరోసా నిధులు
- 2 లక్షల 89 వేల 448 మంది రైతులకు 137 కోట్లు జమ
- రైతులు రైతు భరోసా నిధులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఉష



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సిద్దిపేట జిల్లా నర్మెట్టలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రైతు భరోసా మొదటి విడత నిధులు విడుదల చేసిన కార్యక్రమాన్ని, వి.సి.యూనిట్ ద్వారా రంగారెడ్డి జిల్లాలో 58 రైతు వేదికల్లో, రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్ అబ్దుల్లాపూర్మెట్ రైతు వేదిక నుండి రైతులతో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించడం జరిగింది. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

**2 లక్షల 89 వేల 448 మంది రైతులకు 137 కోట్లు జమ..**

జిల్లాలోని 2 లక్షల 89 వేల 448 మంది రైతులకు ఎకరానికి 6 వేల రూపాయల చొప్పున 137.11 కోట్లు మొదటి విడతగా వారి ఖాతాల్లో నేడు రైతు భరోసా జమ కానున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఉష తెలిపారు. రైతులు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు సద్వినియోగం చేసుకుని యాసంగి పంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి లాభదాయకం వ్యవసాయం చేయాలని సూచించారు.

**ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన జిల్లా రైతులు...**

రంగారెడ్డి జిల్లా నుంచి ఆదివారం నాలుగు బస్సులలో, తలకొండపల్లి, మాడుగుల, ఆమనగల్, కేశంపేట్, షాబాద్ మండలాలకు చెందిన సుమారు 200 మంది రైతులు, సిద్దిపేట జిల్లాలో నిర్వహించిన ముఖ్యమంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం నర్మెట్టలో నూతనంగా నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన సందర్భంగా, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని జిల్లా రైతులు సందర్శించడం జరిగింది.. ఆదివారం సిద్ది పేట జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నంగునూరు మండలం నర్మెట్టలో కొత్తగా నిర్మించిన ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో యాసంగి సీజన్ కు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులు మంత్రులతో కలిసి విడుదల చేశారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులకు 9 వేల కోట్ల రూ.లు విడతలు వారీగా రైతుల ఖాతాల్లో 45 రోజుల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం మొదటి విడత 3590 కోట్ల రైతు భరోసా విడుదల చేసినట్లు తెలిపారు. రైతులు పంట మార్పిడి చేయాలని కూరగాయలు, జొన్నలు తదితర పంటలు పండించాలని అన్నారు.



# రైతు ఉత్సవాలకు జిల్లా నుంచి బస్సులు

### మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

**మంచిర్యాల, మహా:** ప్రభుత్వం సిద్దిపేటలోని నర్మెట గ్రామంలో తలపెట్టిన రైతు ఉత్సవాలకు మంచిర్యాల జిల్లా నుండి 2 బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ ఎ. డి. ఎ. కార్యాలయం నుండి ఆత్మ చైర్మన్ ఎస్. మురళి, వ్యవసాయ శాఖ ఏడిఏ, మండల వ్యవసాయ అధికారులు, చెన్నూర్, భీమిని డివిజన్ల రైతులతో బస్సు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. మంచిర్యాల డివిజన్ లోని దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్, జన్నారం మండలాల రైతులతో లక్షెట్టిపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నుండి ఒక బస్సు రైతు ఉత్సవాలకు బయలుదేరిందని తెలిపారు.

# ప్రమాదాలు జరిగితే రిపోర్టులు రాయడంలేదు

- కాసిపేట-2 గనిలో యాజమాన్యం, గుర్తింపు సంఘం వింత నాటకం
- పైరవీలు వాళ్ళవే...విమర్శలు వాళ్ళవే
- గుర్తింపు సంఘం ఏఐటియుసి యాజమాన్యానికి తొత్తుగా మారింది



**మందమర్రి, మహా :** మందమర్రి ఏరియా వివిధ గనులలో ప్రమాదాలు జరిగితే యాజమాన్యం ప్రమాద రిపోర్టులు రాయడంలేదని ఐ.ఎన్.టి.యు.సి. మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్యలు ఆరోపించారు. ఆదివారం ఐఎన్టియుసి కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాసిపేట 2 గనిలో ప్రమాదం జరిగిన కార్మికులు చికిత్స కొరకు రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి వెళితే ఆ గనిలోని సూపర్వైజర్ లను యాజమాన్యం ఆసుపత్రికి పంపి మీకు రోజువారీగా మాస్టర్లు వేస్తాం అవసరమైతే మూడు నెలల పాటు సర్ఫేస్ లో ఉంచుతాం రిపోర్టులు అవసరం లేదని సర్ది చెప్తూ కార్మికుల నష్టపరుస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. ఆయా కార్మికులకు ఏదైనా జరగరాని ఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నించారు. గత కొన్ని సంవత్సరాలుగా మందమర్రి లో కంపెనీ గృహాలు లేని కార్మికులకు హెచ్ఆర్ఏ (ఇంటి అద్దె) ను యాజమాన్యం చెల్లించడం లేదని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కార్మికులకు కంపెనీ గృహం లేనట్లయితే హెచ్ఆర్ఏ చెల్లించాలని యాజమాన్యానికి హితవు పలికారు. కార్మికుల సంక్షేమం కోసమే ఎర్ర జెండా అంటూ కల్లబొల్లి మాటలు చెప్పి సింగరేణి గుర్తింపు సంఘం గా గెలిచిన ఏఐటియుసి నేడు కార్మిక హక్కులను పరిరక్షించడం లేదని వారు ధ్వజమెత్తారు.

**ఏప్రిల్ మాసంలో మెడికల్ బోర్డు**

సింగరేణి కాలరీస్ కంపెనీలో ఏప్రిల్ మాసంలో మెడికల్ బోర్డు నిర్వహించేందుకు యాజమాన్యంపై ఐఎన్టియుసి ఒత్తిడి చేస్తుందని ఆ సంఘం కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్యక్షులు దేవి భూమయ్యలు పేర్కొన్నారు. గత కొన్ని నెలలుగా సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మెడికల్ బోర్డు నిర్వహించలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ వేసే తైలాలకు ఆశపడి గుర్తింపు సంఘం నేతలు యాజమాన్యంపై ఒత్తిడి చేయడం లేదని పేర్కొన్నారు. పైరవీలు వాళ్ళవే...విమర్శలు వాళ్ళవే నాని ఎద్దేవా చేశారు. సింగరేణి సంస్థతో మాట్లాడే సత్తా లేక మా యూనియన్ పై నిందారోపణలు చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ప్రస్తుతం వేలమంది కార్మికులు మెడికల్ బోర్డు కొరకు ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. ఆయా కార్మికుల ఆశలను ఐఎన్టియుసి సహకారం చేస్తుందని వారు భరోసా పలికారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నేతలు చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామ్ శెట్టి నరేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కేంద్ర కమిటీ కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి ఓదెలు, పెట్టు కార్యదర్శి శనిగారపు రాములు, భీమారపు సదయ్య, కారుకూరి తిరుపతి, నూనె సాంబయ్య, కొప్పుల బాబు, కన్నయ్య, రాములు, కిషోర్, మధుబాబు, దేవేందర్ రెడ్డి, అనిల్ కుమార్, రవి, రాము, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.



# యారం స్వరూపమ్మకి నివాళులు అర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన యారం స్వరూపమ్మ అనారోగ్య కారణాలతో ఆదివారం మరణించారు. ఆమె ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి గారి తల్లిగాను, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గారి సోదరిగా గ్రామంలో మంచి పేరు ఉంది యారం స్వరూపమ్మ మృతిపట్ల స్థానిక కాంగ్రెస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ మాజీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, బూర్గంపాడు మండల మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, మండల కాంగ్రెస్ నాయకుడు కైపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.




# నేత్ర నిపుణుల సంఘానికి కొత్త కమిటీ

### కండె దేవేందర్‌కు జిల్లా అధ్యక్ష బాధ్యతలు

**పినపాక, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆప్టోమెట్రీ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా కండె దేవేందర్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా ప్రేమ్, జనరల్ సెక్రటరీగా నరేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసన్న, ట్రెజరర్‌గా రమేష్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ద్రోణ ఎన్నికైనట్లు రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కంటి సమస్యల పరిష్కారమే లక్ష్యం. ఈ సందర్భంగా కండె దేవేందర్ మాట్లాడుతూ జిల్లాలో ఆప్టోమెట్రీకి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఆర్ఆర్ నేత్రాలయ ఎండీ భగవాన్, జిల్లా మాజీ అధ్యక్షులు రాజేష్, రమేష్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ బాధ్యతలు అప్పగించిన పెద్దలకు దేవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# మందమర్రిలో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణకు 2. కోట్ల 31 లక్షలు

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా :** మందమర్రిలో మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణకు 2. కోట్ల 31 లక్షలు రూపాయలు విడుదల చేసినట్లు తెలంగాణ రాష్ట్ర కార్మిక ఉపాధి మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. ఆదివారం ఊరు మందమర్రి చెరువు సుందరీ వికరణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ కొరకు పట్టించుకోలేదని తెలిపారు. వారి నిర్లక్ష్యం కారణంగా చెరువు చుట్టుపక్కల ప్రాంతం అస్తవ్యస్తంగా ఉందని పేర్కొన్నారు. పట్టణ ప్రజల ఆనందం ఆహ్లాదం కొరకు చెరువు సుందరీకరణ 2 కోట్ల 31 లక్షల వ్యయంతో చేపట్టినట్లు వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాయలింగు, కాంగ్రెస్ మందమర్రి పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, బండి సదానందం యాదవ్, పుల్లూరి లక్ష్మణ్, గుడ్ల రమేష్, ఆకారం రమేష్, మద్దెల విజయ్, పైడిమల్ల నర్సింగ్, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 23-03-2026



# కూరెళ్ళ 'విఠలేశ్వర శతకం'లో జీవన తాత్త్వికత దృష్టి

డాక్టర్ కూరెళ్ళవిఠలాచార్య జగమెరిగిన కవన ఋషి. ఆయన సృజన కృషి అత్యంత విస్తృతమైనది. పద్యం ,వచన కవిత ,విమర్శ పరిశోధన ,తదితర ప్రక్రియల్లో ప్రభావశీలమైన రచనలు చేశాడు. పద్యంలోనే కాదు నానీ లో కూడా ప్రజావాణినిని పలికించాడు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా,ఆదర్శ అధ్యాపకుడిగా అంతేవాసుల అంతరంగాల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నాడు. మారుమూల పల్లెలో మహాగ్రంథాలయాన్ని స్థాపించి పల్లె నుండి ఢిల్లీ దాకా విశేష కీర్తినార్జించాడు. విఠలాచార్య జీవితం వడ్డించినవిస్తరికాదు. దుర్భరమైన పేదరికంలో జీవించాడు .భువనగిరి వీధుల్లో భిక్షమెత్తుకొని తిరిగి చదువుకున్న ఆయన, ఇవాళ తను స్థాపించిన గ్రంథాలయం ద్వారా జాతికిజ్ఞానభిక్ష పెడుతున్నాడు ''పల్లియలోనేపుట్టితిని,పల్లియయేనను పెంచె,పల్లియే/ఇల్లునువాకిలి,కలిమినిచ్చే,బతుక్కు మెరుంగుపెట్టె''.అనిసవినయంగాపల్లెతల్లికి ప్రణమిల్లాడు.విఠలాచార్య పల్లెటూరుపక్షపాతి.పల్లెఆయనకు జీవనసంస్కారాన్ని,మానవసంబంధాలఎరుకనుకలిగించింది.పల్లెఆయనకుసాంఘీకశాస్త్రమయింది. సజీవనిఘంటువయింది.సామాజిక వైవిధ్యాన్ని,వైరుధ్యాలనుఅర్థంచేసుకోవడానికిపల్లెటూరిజీవనంఎంతగానోకవికిఉపయోగపడింది.బాల్యంలో అనుభవించినపేదరికం,బహుజనఅస్తిత్వంఇందుకుమరింతదోహదపడింది. తొంబయ్యోదశకంలోఆస్తిత్వద్యమాలు సాహిత్యంలోకొత్త ప్రశ్నలు లేవనెత్తాయి. వర్గం , కులం, మతం,జెండర్,రాజ్యం, అనేక అంశాలు గురించి సాహిత్యంలో విస్తృతంగ చర్చజరిగింది . ఈస్పృహ విఠలేశ్వర శతకం నిండా దర్శనమిస్తుంది. అందుకే రూపం ,సంప్రదాయమైనప్పటికీ శతక సారం సమకాలీన చేతనయే. వర్తమాన సామాజిక ,ఆర్థిక,రాజకీయ పరిస్థితులకు ఈ శతకం అద్దం పడుతుంది.వర్తమాన కాలధర్మ చిత్రణ యే సాహిత్య మౌలిక తత్త్వం. విఠలేశ్వర శతకం కాల స్పృహను వాగ్దానం చేస్తుంది. ఈ శతకానికి ఎప్పటికీ ప్రాసంగికత ఉంటుంది.

విఠలాచార్య వ్యక్తిత్వం ఎందరికోఆదర్శనీయం.కవి మూర్తిమత్వం కవిత్వంలో అనివార్యంగా ప్రతిఫలిస్తుంది.''నాకు కవిత్వమె బ్రతుకు ,నాకు శ్రమించెడి వాడెఇష్టుడున్/నాకు నరుణ్ణి దైవమనినమ్మెడివాడె మహాను భావుడున్/నాకు మనస్వియే ప్రభువు /నాకు దయాళుడే విష్ణు రూపుడున్'' ఈపద్య భావంలో విఠలాచార్య వ్యక్తిత్వంఅర్థమవుతుంది . ఆయన కవిత్వమే బ్రతుకు గా భావించాడు .బాల్యం నుండి కష్టాల్లో మునిగితేలిన ఈకవికి కష్టజీవి అంటే ఇష్టం. మనిషిని దైవంగా కొలిచే వాడే మహానుభావుడు అనిఉన్నతంగా ప్రకటించాడు.



- డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య

విఠలేశ్వర శతకంలో శ్రమ తత్త్వాన్ని కవి సముచితంగా అక్షరబద్ధం చేశాడు. భోగ జీవనాన్ని తిరస్కరించాడు.ఇందు వల్ల కలిగే అనారోగ్యం, తద్వారా అనేక అనర్థాలు సంభవిస్తాయని కవి హితవుచెప్పాడు.''భోగము వద్దు, కష్టపడు బుద్ధియే కావలె విఠలేశ్వరా" అంటాడు. 'కండలు పిండి రేబవలు కష్టము చేయు ఫలంబులేదుగా'' మనిషికి కష్టపడేతత్వం ఉండాలని ,కష్టానికి తగ్గ ఫలితం శ్రమజీవికి ముమ్మాటికీ దక్కాలని కవి వాదించాడు." ఒక్కడెవండొ కష్టపడ ఒక్కడెవండొసుఖించు భోగియై" అంటూ శ్రమదోపిడిని వ్యతిరేకించాడు. సమాజంలోని ఆర్థిక అసమానతలను కూడా కవి నిర్మొహమాటంగా ఎత్తిచూడు."కూటికి లేక ఏడ్చేవాళ్లు, కోట్లు కావలెనని ఏడ్చే వాళ్ళు, ఓటుకు కోసం'' పెద్దగా వగచే వాళ్ళతో విశ్వం నిండిపోయిందని,కవి ఆక్షేపించాడు

సమాజంలో కులం ,మతం చుట్టూ ఆవరించిన దురభిమానాలను , వీటివల్ల కలిగే సామాజిక ప్రమాదాల గురించివిఠలేశ్వర శతకంలోవిఠలాచార్య విపులంగా చర్చించాడు . కులమును ఎవడు సృజించెనో,ఈ అభి జాడ్యాన్నిఎవడు పెంచి పోషించాడో గానీ దీని వల్ల నవత త్రుంచి వేయబడిందని, జనత నిలువునా చీలిపోయిందని కవి ఆవేదన వ్యక్తం చేశాడు .'కులముల పేర సోదరులె కొట్టుక చచ్చుట జరుగు చుండె ,ఫ్రే/మలు జనమందు పోయెను, దుమారము లేపు మతాలుపుట్టె, పెద్దలే విపరీత బుద్ధులకు దాస్యము చేసెడి కాలమొచ్చెను'' అని పెచ్చుపెరిగిపోతున్న కుల,మత కాలుష్యాన్ని దాని నిర్మూలన ఆవశ్యకతను విఠలాచార్య పరోక్షంగా తెలియజేశాడు.

ఎన్నికల రాజకీయాల తీరుతెన్నుల్ని , ఓటు ప్రలోభాలను,మైకులు బద్దలై పోయే మంత్రుల మాయ మాటలని , ప్రజాస్వామ్యంలోని డొల్లతనాన్ని ఈ శతకంలో విఠలాచార్య సమర్థవంతంగా చిత్రించాడు. ''ఎవ్వడు నిక్కి నిక్కి ఘనుడెవ్వడు వేదికనెక్కి చెప్పినా/ ఎవ్వడు వంగి వంగి మన నెవ్వడు ఓటుకు కాళ్ళు మొక్కినా'' లాభం లేదని, ప్రజలు ఎవరిని మెచ్చినాయకుడిగా ఎన్నుకుంటారో అతనేప్రజా నేతయనివిఠలాచార్య తేల్చి చెప్పాడు .ఓట్ల దినాలలో నోట్లు లభిస్తాయని ,సారా ప్యాకెట్లకు గిరాకీ పెరుతుందని ,రిగ్గింగులు కో కొల్లలుగా జరుగుతాయని,. మిత్రులే పరస్పరం శత్రువుల్లాగా మారిపోతారని ఎన్నికల సందర్భంలో ని రాజకీయవాతావరణాన్ని కవి వాస్తవ దృష్టి తో వర్ణించాడు .''పది తలలున్న రావణుని పాలనలో తిక్కయొక్కటే'' కానీ పదులను మించి తలలున్నకొందరు నాయకులకు అనేక తిక్కలున్నాయని పాలక వర్గాల విపరీత ధోరణులను పదునైన శైలిలో కవివిమర్శించాడు. మంత్రి మాటలో ,కూటిలో ,సాధుజన కోటిలో ,ఎన్నికల ఓటులో,చివరకి ప్రేమికుల మాటలో కూడా కల్తీ ఉందని అనేక రకాల కొత్తరకంకల్తీలను గురించి తన పద్యాల్లో ఈ కవి బట్టబయలు చేశాడు. ఈకాలానికి, వర్తమానసాంఘీక పరిస్థితులకు అవసరమైన సందేశం శతక పద్యాల్లో నిండుగావుంది.

విఠలేశ్వర శతకంలో కవి ప్రయోగించిన భాష ఈ రచనకు గొప్ప విలువను సమకూర్చింది. జన వ్యవహారానికి సామీప్యంగా వృత్తపద్యాలు రాయడం చాలా కష్టం.గ్రాంథిక పదబంధాలు,తదనుగుణమైన విశేషణాలుంటే తప్ప పద్యం ముందుకు సాగదు . విఠలాచార్యకు భాష మీద అపారమైన పట్టు ఉండడం వల్ల నల్లేరు మీద నడక లాగా రస బంధురంగా పద్యరచనసాగించాడు . 'పల్లియే పల్కులు పల్కగా నెరిపించే'' అని స్వయంగాకవి ప్రకటించినట్లు గాశతకంలోని పద్యమాధుర్యానికి పల్లె యే ప్రధాన కారణమని భావించవచ్చు. గ్రామీణభాషాసాగరంలో చవులూరించే తెలుగు పల్కుల తీయందనం ఈ పద్యాల్లో కనిపిస్తుంది. పల్లీయ పలుకుబడితో ఈ శతకంలోని పద్యాలు పాఠకులకు మరింత సులభ గ్రాహ్యంగా ఉంటాయి . ఆంగ్లం పట్ల మోజుతో, తెలుగు భాషామ తల్లిని దూరం చేసుకొని కలగూరగంప లాంటి వ్యవహారంతో పల్లె నుడికారాన్ని కలుషితం చేసిన 'మొనగాండ్ర'ను ఈ కవి ఎగతాళి చేశాడు.'' పొట్టిగా నుండు వాణ్ణి, పెను పొట్టనుగల్గిన వాణ్ణి.ఎట్టి ఇక్కట్టుల నైన పోగొట్టే వాణ్ణి''అంటూ సాగే వినాయక స్తుతిలో నిరాడంబరమైన పద్యశైలి అవగతమవుతుంది. ఏమాత్రం అర్థం కాని మారుమూలపదాలు వాడే కవులను 'దుర్విటులు' అని తిక్కన నిందించాడు. అచ్చమైన పల్లె పదాలు పరిగెత్తుకుంటూ వచ్చి ఛందో గమనంలో అల వోకగాకలిసిపోయాయి . యన్ గోపి అన్నట్లు తెలంగాణ వాడుక భాష విఠలాచార్య పద్యంలో హాయిగా ఒదిగిపోయింది 'నీ బాంచనటంచు', అల్పం ,చిల్లర గాళ్ళు, వెక్కిరించుట, సేర్జీ, సోకులమారి, లంచగొండిబొర్రన్నలు,ముచ్చట,తిప్పలు,దుమారము , బుక్కెడు తిండి ,కొన్ని దినాలు, ఎగ్గొట్టిన,తెంపు, తత్తర బిత్తర,ఉర్కులుపరుగులు ,లోనలొటారం లాంటి పదాల తోపాటు , డూప్లికేటు, క్లబ్బులు రిగ్గింగు , బ్లూ సినిమాలు లాంటి ఆంగ్లపదాలు,అన్యదేశ్యాలు కూడా గణ,యతి,ప్రాసల పరిమితులకు లోబడి విఠలాచార్య పద్యపాదాల్లో సహజంగా అమరిపోయాయి.

చితికిన ప్రాణులను, దుఃఖితమగుజీవులను ఆదరించమని కవిప్రవచించాడు. 'నితాంత అపార భూతదయ'యేఈ శతకోదయానికి పురుడు పోసింది. పశు పక్ష్యాదులను ప్రాణ పదంగా భావించే విఠలాచార్యఅనారోగ్యం పాలైన తమ ఇంటి గేదెకు వైద్యం చేయిస్తూ ప్రమాదానికిగురై నెలల తరబడి మంచం మీద ఉన్నాడు. ఈ వేదనా శయ్య మీదనుండే కవి విఠలేశ్వర శతకాన్నిరచించాడు. విఠలేశ్వర శతకం ఒక తాత్త్విక శతకం. నీతి శతకం .ఆత్మకథాత్మక మైన శతకం. అన్నింటికీ మించి సామాజిక శతకం ''పుస్తకమున్న హస్తమున పుత్తడి కంకణముండినట్టులే/పుస్తకమున్న నేస్తమున పూర్ణగుణంబులు నుండినట్టులే/పుస్తకమే మనస్సునకు పూర్ణత నిచ్చును విట్టలేశ్వరా '' అని ఒక పద్యంలో కవి చెప్పినట్లుగానే ఈ శతకం అధ్యయనం చేస్తే మనస్సునకు పూర్ణత చేకూరుతుంది . పరిపూర్ణ వ్యక్తిత్వం అవగతమవుతుంది . నైతిక సమన్వితమైన జీవనతాత్త్విక దృష్టి అలవడుతుంది. ఇదే ఈ రచనకు ఫలశ్రుతి.



డాక్టర్ కోయి కోటేశ్వరరావు
9440480274

# 'కవి'తాంతరంగం!

వాక్యాన్ని ముగించినట్లు
ఏ కవితను ముగించలేడు
ప్రతి పద్యమూ
కవితాంతరంగా శకలమే!
ముగించిన ప్రతిసారి
ఒక మెరుపు ఒక తరంగం
కవిని వెన్నాడుతూనే ఉంటుంది
కవి కళ్ళ ముందు
కాలం పెద్ద మాయల మరాఠీ
ఎంత రాసినా
కవి అలసిపోవలసిందే
దృశ్యాలకు కొదవుండదు
రోజూ పూచే ఉదయాస్తమయాలు
కవికెప్పుడూ సంభ్రమాశ్చర్యాలే
ప్రేమ ఒక్కటే
అల్లికలు అనంతం
యుద్ధ రూపమొక్కటే
దుఃఖ తరంగాలు అనేకం
అన్ని అనుభవాలు
కవికి నిద్రను దూరం చేసేవే
నిత్యం కలమెత్తడమంటే మాటలు కాదు
కవి తన చితిని తానే పేర్చుకోవడం

విశ్వ శ్రేయస్సు ఎన్నటికీ
కవిని కలవర పెట్టే కలనే
భూగోళం మీద జరిగే యుద్ధాలు
రాజ్యాధినేతల స్వార్థ ప్రేరితాలు
కవి హృదయమంతా
నిరంతర యుద్ధ క్షేత్రమే
సమ సమాజ స్థాపనే కవి పోరు లక్ష్యం!!



- కోట్ల వెంకటశ్వర్ రెడ్డి
9440233261

# జీవితమే నిలదీస్తే..



- డా.జె. రవీంద్రనాథ్
8978131585

కూలిన బడి శిథిలాల కింద
రాలిన పూవులు విలపించాయి
అసత్యం మరో సారి
అమాయకత్వాన్ని బలి తీసుకుందని
మంటల్లో చిక్కుకున్న భవనాలు
రోదించాయి
మనిషి శ్రమ నిష్ఫలం అయిందని
తెగి పడ్డ చేతులు కాళ్ళు తలలు
వెక్కిరించాయి తెల్ల నాగరికతని
ఇనుప గద్దకు పావురం ఫలాహారం
వెన్నెముక లేని దేశాల కాళ్ళు
చల్ల బడ్డాయి!
నోళ్ళు మూత బడ్డాయి!
కానీ బాధితుల కళ్ల బావుల్లో
నిప్పులు ఊరాయి
జీవితమే నిలదీస్తే
చావు చచ్చిపోయింది!

# నిన్నటి జ్ఞాపకం..



ఈతకోట సుబ్బారావు
9440529785

రాత్రంతా...
అమ్మ నిద్దర పోనిరోజు
నాకింకా గుర్తుంది
ఒక నిశ్శబ్ద తుఫాను
గుండె తీరాన్ని తాకి
ఆత్మ విశ్వాసాల పునాదుల్ని చిన్నా భిన్నం చేసిన
ఆరాత్రి అమ్మకట్టు బానిసై
నాన్న పక్కలో శవమై
పూలతోటై...
కాగితం పూలని వళ్లంతా పూచి ఎక్కిళ్లని ..
చిరునవ్వుల వెన్నెల చాటు దాచిన ఆ సజీవనటన
నాకింకా గుర్తుంది.
నాన్న చేసిన తప్పులో
ఆడదిగా నానమ్మ చేసిన నేరం మాతృత్వపు శ్వేత వస్త్రం పై
రక్తం తో గీసిన కొత్తచిత్రం
ఇప్పటికీ
కనురెప్పల పైన
కునుకు మొలవని రోజు
నాకింకా గుర్తుంది

# ఛాయ్ కప్పులో యుద్ధ దృశ్యం

ఇరానీ ఛాయ్ తాగుతుంటే
తియ్యగా అనిపించటం లేదు
పొగపొగ వాసన !
టీ లోఎవరో బాంబు వేసి పాడుచేసారు !!

ఒంటరి ఇరాన్ యుద్ధం ఎవరికైనా హృదయ విదారకంగా అలజడియే
దయలేని సంపన్న దేశాల క్షిపణుల సర్కస్

రేపు ప్రపంచమంత ఇగ పాడుపడిపోతుంది

ఎవరూ ఉండరు
ఒంటరిగా మండే భూగోళం తప్ప
భ్రమణ రోదనం భూమికి

తప్పు తప్పు యుద్ధం తప్పు !
శాంతి ఒక్కటే ఒప్పు !
గాయపడిన పావురం లేచేదెట్లా??

- కందాళై రాఘవాచార్య
8790593638

రచనలకు ఆహ్వానం
సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
haneefsd777@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...
తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# అస్తిత్వాన్వేషణలో అక్షరాలు-“గీసి చెరిపే బొమ్మ”


సమకాలీన తెలుగు కవిత్వం నేడు కేవలం భావవ్యక్తీకరణ స్థాయిలో నిలవకుండా, మనిషి-సమాజం-అస్తిత్వం మధ్య ఉన్న లోతైన సంబంధాలను తాత్వికంగా ప్రశ్నించే దశకు చేరుకుంది. ఈ పరిణామ క్రమంలో కంచరాన భుజంగారావు గారి కవిత్వం ఒక ప్రత్యేకమైన సృజనాత్మక ప్రయాణంగా నిలుస్తుంది. “నీటి గింజల పంట” కవిత సంపుటితో జీవన వాస్తవాలు, సామాజిక స్పర్శ, సహజ భాషా ప్రవాహంతో తన కవితా స్వభావాన్ని పాఠక లోకానికి పరిచయం చేసిన ఆయన, రెండవ సంపుటి “గీసి చెరిపే బొమ్మ” లో ఆ ప్రయాణాన్ని కేవలం కొనసాగింపుగా కాకుండా, శిల్పాత్మక-తాత్విక పునర్నిర్మాణంగా మలిచారు. అనుభూతికేంద్రిత కవిత్వం నుంచి అస్తిత్వ ప్రశ్నలు, జీవితార్థాన్వేషణ, మానవ స్థితిగతుల తాత్విక ఆవిష్కరణ వైపు ఆయన కవిత్వం చేసిన ఈ మార్పే ఈ రచనకు కేంద్రబిందువు. అందుకే ఇక్కడ లక్ష్యం కవితలను కేవలం ఆస్వాదించడం కాదు; కంచరాన భుజంగారావు గారి కవిత్వ పరిణామాన్ని, దాని సౌందర్య-తాత్విక దృక్కోణాన్ని, సమకాలీన తెలుగు కవిత్వంలో దాని స్థానం ఏమిటో విశ్లేషణాత్మకంగా ఆవిష్కరించడమే.

“విపత్తు ప్రాంతం” కవిత తెలుగు కవిత్వంలో ఒక స్పష్టమైన నిరసన స్వరంగా కనిపిస్తుంది. ఉద్వేగశూన్యత, నైతిక నిర్వీర్యత, మౌన సహకారం వంటి సమాజ లక్షణాలను ప్రతీకల ద్వారా ఆవిష్కరిస్తూ, కవిత్వానికి తటస్థంగా ఉండే స్థానం లేదని ఈ కవిత సూచిస్తుంది. “ఉద్వేగం లేని గొంతులో కవితా పాదాలు చకచకా కదలాడవు”, “నిరసన జెండాలయి పాతుకోనిదే అక్షరాలకు ఊపిరి సలపదు”, “ప్రాణాలకన్నా న్యాయానికి విలువెక్కువ” వంటి పాదాల ద్వారా కవిత్వాన్ని కేవలం భావవ్యక్తీకరణగా కాకుండా, సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తుంది. అలంకారానికే పరిమితమైన కవిత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రతిఘటనలేని పద్యానికి సార్థకత ఉండదనే భావాన్ని వ్యక్తం చేస్తుంది. “విపత్తు ప్రాంతం” భౌగోళిక స్థలం కాదు, నైతిక పతనంతో నిండిన సమాజాన్ని సూచించే రూపకం. ఈ కవిత నిరసనాత్మక కవిత్వానికి ఒక దిశను సూచించే రచనగా నిలుస్తుంది.

“ఒంటరి” కవిత ఆధునిక మనిషి అంతర్గత ఏకాంతాన్ని, భావపరమైన శూన్యతను తాత్విక ప్రతీకల ద్వారా వ్యక్తం చేస్తుంది. “ఇదొక ఒంటరి భూఖండం”, “ఊపిరి దీపాల ఏకాకి సంచార స్థావరం” వంటి పాదాల ద్వారా వ్యక్తి తనను తాను ఒక భూభాగంగా రూపాంతరం చేసుకొని, సంబంధాల విచ్ఛేదాన్ని ప్రతీకాత్మకంగా చూపిస్తాడు. “బ్లాక్ హోల్”, “శూన్య భారం”, “సూదిపోటు” వంటి రూపకాల ద్వారా మానసిక ఒత్తిడి, ఆలోచనా భారాన్ని దృశ్యాత్మకంగా మలుస్తుంది. నగ్న శరీరం మీద ధూళి మేఘం కూలబడటం, లంగరేసిన నావలా నిరీక్షించడం వంటి దృశ్యాలు వ్యక్తి స్తబ్దతను, అంతర్గత నిరీక్షణను సూచిస్తాయి. అయితే కవిత ముగింపు పూర్తిగా నిరాశలో కాకుండా “స్వేచ్ఛ రెక్కల మీద ఎగరేసుకుపోయి...మానవ ఖండానికి చేర్చే వరకూ” అనే పాదాలతో ఒంటరితనానికి వ్యతిరేకంగా మానవత్వం వైపు ప్రయాణించే ఆశావాద దృక్కోణాన్ని వ్యక్తం చేస్తుంది. “ఒంటరి” కవిత ఒంటరితనాన్ని వ్యక్తిగత అనుభూతిగా మాత్రమే కాకుండా, సమకాలీన మానవ స్థితిగతుల ప్రతీకగా చూపించే కవితగా నిలుస్తుంది.

“ఊయల చీర” కవిత ప్రకృతి-మనిషి సంబంధాన్ని మాతృత్వ రూపకంలో సున్నితంగా వ్యక్తం చేసిన లిరికల్ కవిత. “చీకటి ఆకాశం నిండా చుక్కలు”, “ఆకాశం అమ్మపొట్టలోకి మునగదీసుకున్న చందమామ”, “వెన్నెల నవ్వు” వంటి ప్రతీకలు రోదసిని తల్లిగా, భూమిని శిశువుగా చూపిస్తూ విశ్వాన్ని ఒక ఆత్మీయ స్థలంగా రూపాంతరం చేస్తాయి. గాలి జోలపాటగా మారడం, అవనీ-నేను బుజ్జాయిలమవడం ద్వారా కవి తనను ప్రకృతిలో లీనమైన జీవిగా చూపిస్తాడు. ముఖ్యంగా “మహాశూన్యానికీ నాకూ మధ్య ఆకాశమొక ఊయల చీర” అనే పాదం శూన్యతలో కూడా మనిషి ఆశ్రయాన్ని, భద్రతను అనుభూతి చెందే భావాన్ని వ్యక్తం చేస్తుంది. అలంకారికత, దృశ్యాత్మకత, మాతృత్వ భావం కలిసి “ఊయల చీర”ను ఒక మృదువైన, ఆత్మీయ ప్రకృతి కవితగా నిలబెడతాయి.

“యువర్స్ బ్యూటిఫుల్లీ..!” కవిత ప్రేమను సాధారణ వర్ణనగా కాకుండా, సౌందర్య అనుభూతిగా వ్యక్తం చేసిన లిరికల్ కవిత. నీలిమ, తార, నవ్వుతీగ, సుగంధ మట్టి, రత్నం, పుత్తడి వర్ణం వంటి రూపకాల ద్వారా స్త్రీ సౌందర్యాన్ని కేవలం శరీర స్థాయిలో కాకుండా, ప్రకృతి-విశ్వ సౌందర్యంలో భాగంగా చూపిస్తుంది. ప్రతి దృశ్యం ఒక కళాత్మక రూపంలా నిర్మితమై, ప్రేమను ఒక సృజనాత్మక అనుభూతిగా మలుస్తుంది. ముఖ్యంగా “యువర్స్ బ్యూటిఫుల్లీ..!”




అనే పునరుక్తి కవితకు లయను, మృదుత్వాన్ని ఇస్తూ భావాన్ని బలపరుస్తుంది. ఈ కవితలో ప్రేమ ఆకర్షణగా కాదు, ఆరాధనగా, అంతర్గత అనుభూతిగా వ్యక్తమవుతుంది. దృశ్యాత్మకత, లయాత్మక భాష కలిసి దీనిని ఒక సొగసైన ఆధునిక ప్రేమకవితగా నిలబెడతాయి.

“బోలు ఇల్లు” కవిత ఆధునిక వృద్ధాప్య జీవితంలోని ఒంటరితనం, ఖాళీ ఇళ్ల నిశ్శబ్దం, సంబంధాల దూరాన్ని సున్నితంగా చిత్రించిన సమకాలీన కవిత. పిల్లలు “అమెరిక చెట్టుమీద గూళ్లు కట్టుకున్న” రూపకం ద్వారా వలస జీవనాన్ని సూచిస్తే, ఇంట్లో మిగిలిన వృద్ధ దంపతుల జీవితం ఒంటరిగా, అలవాట్ల చక్రంగా మారిపోయిన స్థితిని కవిత చూపిస్తుంది. నిండు గదులు-ఖాళీ మనసులు, మందులు-మంచి నీళ్లు-ఊతకర్రలతో నిర్వచితమైన రోజులు వృద్ధాప్య జీవన యాంత్రికతను వ్యక్తం చేస్తాయి. ముఖ్యంగా చివరి ప్రశ్న “ఆమెకు అల్జీమర్స్ ముదిరిపోయింది సరే, నాదో అనుమానం ఖండాలు దాటెల్లిన మా బిడ్డలకూనా...?” భార్య జ్ఞాపక నష్టం కన్నా పిల్లల భావదూరం ఎక్కువ వేదనగా మారిన అంతర్గత బాధను చూపిస్తుంది. “బోలు ఇల్లు” ఒక ఇంటి కథ మాత్రమే కాదు; అది ఆధునిక కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న భావశూన్యతకు ప్రతీకగా నిలిచే హృదయస్పర్శి కవిత.


“వర్ణపటం” కవిత జీవన మార్పును, సౌందర్య ప్రవాహాన్ని ప్రకృతి రూపకాల ద్వారా సున్నితంగా వ్యక్తం చేసే లిరికల్ కవిత. ఆకుగా మొదలై, సీతాకోకచిలుకగా, చివరకు నదిగా మారే ప్రయాణం జీవితం ఒక నిరంతర రూపాంతరమనే భావనకు ప్రతీకగా నిలుస్తుంది. ఇంద్రధనస్సు, తేనెరంగు, మంచుబుగ్గలు, పుప్పొడి స్పర్శలు వంటి ప్రతీకలు కవితను రంగుల చిత్రంలా తీర్చిదిద్దుతాయి. ముఖ్యంగా “నన్నపుడు నది అని పిలుస్తారు” అనే పాదం వ్యక్తిత్వం విశ్వంలో లీనమయ్యే తాత్విక భావాన్ని స్పష్టంగా చెబుతుంది. “అందం నాలో నిత్య ప్రవాహం” అనే ముగింపు వాక్యం జీవితం నిలకడ కాదు, ప్రవాహమే అన్న భావాన్ని ప్రతిష్ఠిస్తూ, ఈ కవితను సౌందర్యాత్మకమైన జీవనధ్యానంగా నిలబెడుతుంది.

“రెప్పలాడనివాళ్ళ రంగభూమి” కవిత జీవితం-మరణం మధ్య ఉన్న నిశ్శబ్దాన్ని మానవీయ స్పర్శతో, తాత్విక లోతుతో చిత్రిస్తుంది. “రంగులమయంగా ఊరేగే బ్రతుకు” చివరికి తన వర్ణాలను విడిచిపెట్టాల్సిన దశను సూచిస్తూ, ఈ స్థలం జీవన అలంకారాలన్నిటికీ ఆఖరి విరామంగా మారుతుంది. “ఊపిరితో ఉండగా ఊసెత్తడానికే ఇష్టపడని చోటు ఇదే / ఊపిరి వొదిలాక ఊరడించే చోటూ ఇదే” అనే పాదం సమాజపు నిర్లక్ష్యాన్ని, మరణానంతర కృత్రిమ గౌరవాన్ని ప్రశ్నిస్తుంది. సమానత్వం, నిశ్శబ్దం, వివక్షలేని స్థితిని ఈ కవిత మరణభూమికి ఆపాదిస్తూ, చివరగా “ఈ చోటుకు ఉన్నంత హృదయవైశాల్యం బయట కూడా ఉంటే...?” అనే ప్రశ్నతో సమాజానికే నైతిక సందేశంగా మారుతుంది. ఇది మరణాన్ని కాదు, జీవన విలువలను ప్రశ్నించే గంభీరమైన మానవీయ కవిత.

“చినుకు తూలిక” కవిత వానను కేవలం ప్రకృతి ఘట్టంగా కాకుండా, ఒక సౌందర్య అనుభూతిగా, జీవన లయగా చిత్రిస్తుంది. మబ్బు, నింగి, గాలి, నేల, నది ఇవన్నీ మానవ భావాల్లా స్పందించే జీవ స్వరూపాలుగా మారి, వానను ఒక సృజనాత్మక ప్రక్రియగా చూపిస్తాయి. “సిగ్గిల్లిన మబ్బు తునక”, “చిరు చినుకులుగా రెక్క తొడిగింది” వంటి ప్రతీకలు ప్రకృతిని సజీవంగా మలుస్తాయి. వాన భూమిని తాకే తత్వం మాతృస్పర్శలా, జీవదాయక కౌగిలిలా అనిపిస్తుంది. “ఏటిపాటకి నీటిబొట్టు ఆయువుపట్టైంది” వంటి పాదాల ద్వారా వానను ఆశ, జీవనం, కలలతో అనుసంధానిస్తుంది. “చినుకు తూలిక” ప్రకృతి వర్ణన మాత్రమే కాదు, జీవితం, సౌందర్యం, సృష్టి మధ్య ఉన్న లోతైన లయను సూచించే సున్నితమైన కవిత.

“గీసి చెరిపే బొమ్మ” కంచరాన భుజంగారావు గారి కవిత్వ పరిణామానికి స్పష్టమైన ప్రతీక. భావవ్యక్తీకరణ నుంచి తాత్విక ఆలోచన వైపు సాగిన ఆయన ప్రయాణం ఈ సంపుటిలో స్పష్టంగా కనిపిస్తుంది. జీవితం, సమాజం, అస్తిత్వం, ప్రేమ, ఒంటరితనం వంటి అంశాలు ఇక్కడ కేవలం భావాలుగా కాకుండా, ఆలోచనా అన్వేషణలుగా మారతాయి. అందుకే ఇది ఒక కవితా సంపుటి మాత్రమే కాదు, సమకాలీన తెలుగు కవిత్వంలో అస్తిత్వ-తాత్విక సౌరభాన్ని వెదజల్లిన ఒక సృజనాత్మక సాహిత్య ప్రకటనగా నిలుస్తుంది.

చక్కటి కవితా సంపుటిని పాఠక లోకానికి అందించిన కంచరాన భుజంగారావు గారిని హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరెన్నో విలువైన సాహిత్య సంకలనాలను అందించాలని ఆకాంక్షిస్తున్నాను. పుస్తకం కావలసిన వారు అన్ని ప్రముఖ బుక్ షాప్‌లలో పొందవచ్చు, లేదా 9441589602 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు.
వెల: ₹150/



- గాజోజి శ్రీనివాస్
9948483560

# ద్వి భాషా కూడలిలో జీవించడం !



ఇంగ్లీష్ మూలం- మౌమితా ఆలం.
తెలుగు అనువాదం- గీతాంజలి

లేదు రాకిఫ్ !
చివరికి నాకు సమాధానం దొరికింది లే!
మనం ఇక స్నేహితులుగా ఎంత మాత్రమూ,ఎన్నటికీ కొనసాగలేమేమో?
~
ఎందుకంటే మనం రెండు భాషల కూడలిలో జీవిస్తున్నాం కాబట్టి!
నాకు A అంటే ఆపిల్! అంటే కాశ్మీర్ ఆపిల్ అన్నమాట!
B అంటే బ్యాంకు బాలన్స్!
C అంటే కార్ లేదా క్యాష్ !
~
ఓహ్!నీకు చెప్పనే లేదు కదా!
నేను కొత్త కారు కొనుక్కున్నాను !
వృద్ధాప్యపు ముడతలు పోగొట్టుకునే క్రీములు వాడకుండానే నేను ముసలిదాన్ని కాగలను! అంత సహజంగానే మరణించగలను కూడా! ఎందుకంటే నేను అంత సహజాతి సహజమైన దేశంలో బతుకుతున్నాను కాబట్టి !
~
మరి నువ్వు నా దోస్త్?
నీ సంగతేంటి చెప్పు?
నీకు A అంటే జైల్లోని అండా సెల్!
Bఅంటే బెయిల్!
C అంటే కార్ట్రిడ్జ్ !
D అంటే మృత్యువు!
యవ్వనంలో ఉన్న చల్లని,నల్లని నిశబ్దమైన మృత్యువు!
~
నాకైతే మన ఇద్దరి మధ్య ఒక్క నిశ్శబ్దమే ఉంది అనిపిస్తుంది!
మరి నీకేముంది?
బహుశా నా ప్రియమైన స్నేహితుడా!
అదేంటో నాకే బహుశా ఎప్పటికీ తెలీదు!
~
నా పిలుపులు కూడా నీకె న్నటికీ అందలేవు!
ఎందుకో తెలుసా మిత్రమా?
చంపేవారికి, చచ్చి పోయేవారికీ మధ్య జరిగే యుద్ధంలో,
నా ప్రియాతి ప్రియమైన రాఫిక్!
నిన్ను నేను శాశ్వతంగా కోల్పోయాను!

# మార్చిలోనే మండిపోతున్న మణుగూరు..

- ఏప్రిల్‌లో పరిస్థితి ఎలా...?
- బొగ్గు గనుల, చెట్ల కొరతతో ఉష్ణోగ్రతలు పెరుగుదల..
- నీటి ఎద్దడితో ప్రజలకు డబుల్ కష్టాలు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో మార్చి నెలలోనే ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండగా, మరోవైపు మణుగూరు పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉపరితల బొగ్గు గనులు వేడిని మరింత పెంచుతున్నాయి. గనుల నుంచి వెలువడుతున్న వేడి గాలులు, బొగ్గు బ్లాకులు మండుతుండటం స్థానిక ఉష్ణోగ్రతలను తీవ్రస్థాయికి చేర్చుతున్నాయి.

**గనుల వేడి.. ప్రజలకు నరకయాతన..**

మణుగూరు ఏరియాలో విస్తరించిన ఓపెన్ కాస్ట్ బొగ్గు గనులు పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలను గణనీయంగా పెంచుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. గనులలో భూగర్భంలో మండుతున్న బొగ్గు బ్లాకులు నిరంతరం వేడి విడుదల చేస్తుండటంతో పగటిపూట బయటకు రావడానికే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. దీంతోపాటు గనులనుంచి వాహనాల రాకపోకలు, బొగ్గు లాగుల బ్లాస్టింగ్ లతో దుమ్ము ధూళి మణుగూరు పట్టణాన్ని కమ్మేస్తుందని ప్రజలు వాపోతున్నారు. స్థానిక సింగరేణి యాజమాన్యం బొగ్గు గనుల నుంచి వెలువడే ఉష్ణోగ్రతల తీవ్రతను తగ్గించేందుకు తగిన చర్యలు చేపడితే వేసవి తాపం నుంచి కొంత ఉపశమనం కలుగుతుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**చెట్ల కొరతతో పెరిగిన వేడి..**

ఒకప్పుడు పచ్చని అడవులతో కప్పబడి ఉండే మణుగూరు ప్రాంతం ప్రస్తుతం గనుల విస్తరణతో అడవుల కొరతను ఎదుర్కొంటోంది. సింగరేణి గనుల ఏర్పాటుతో పాటు, పోడు భూముల పేరుతో అడవులు నరికివేయడం కూడా వేసవి తీవ్రతను పెంచిన ప్రధాన కారణాలుగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలాగే పట్టణంలో రహదారుల విస్తరణలో భాగంగా రోడ్డు వెంబడి ఉన్న చెట్లను తొలగించడం వల్ల రోడ్లపై నేరుగా ఎండ ప్రభావం పడుతోందని.., దీంతో రహదారులపై పాదసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా సింగరేణి యాజమాన్యం తొలగించిన అడవిలోని మొక్కలను తిరిగి నాటడంలో విఫలమవుతోందని, మూసివేసిన గనుల ప్రాంతంలో నేలను చదును చేసి చెట్లను పెంచి తిరిగి అడవిని సృష్టించడంలో తీవ్రంగా విఫలమవుతోందని పలువురు నేతలు ఆరోపిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం తొలగించిన అడవి స్థానంలో రికార్డుల కోసం లెక్కలు చెప్పడానికో అన్నట్లుగా కాకుండా తిరిగి చెట్లను పెంచి అడవి వాతావరణాన్ని సృష్టిస్తే తప్ప ఏరియాలో వేసవి ఉష్ణోగ్రతలు తగ్గవేమో అన్న అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

**నీటి ఎద్దడి – మరో పెద్ద సమస్య..**

ప్రస్తుత వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రతి ఏడాది వేసవి కాలంలో మణుగూరు మున్సిపాలిటీతో పాటు పరిసర పంచాయతీల్లో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం ప్రజలు పడే ఇబ్బందులు గుర్తుచేసుకొని మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఎండలు మరింత పెరిగితే పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని పలువురు నేతలు, ప్రజా సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వంపై విమర్శలు..**

ప్రతి ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉష్ణోగ్రతలను అధికారికంగా గుర్తిస్తే ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని భావించి ప్రభుత్వం దాన్ని తప్పించుకుంటోందని ఆరోపిస్తున్నారు.

**ఏప్రిల్, మేలలో పరిస్థితి ఎలా..?**

ఇప్పుడే మార్చి నెలలోనే ఇంత తీవ్రంగా ఎండలు మండుతుండగా, రాబోయే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పగటిపూట రహదారులపైకి రావడానికే ప్రజలు వెనుకడుగు వేస్తుండగా, మరింత తీవ్రత పెరిగితే జీవన పరిస్థితులు దుర్భరంగా మారే ప్రమాదం ఉందని అంటున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే.. ఏప్రిల్‌లో అడుగు బయట పెట్టగలమా..? అంటూ మణుగూరు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భక్తి శ్రద్ధలతో పెద్దమ్మ తల్లి కొలుపు





- సరువుల ఊరేగింపులో భారీగా పాల్గొన్న గ్రామస్తులు
- అగ్ని పునీతం చేసి తమ భక్తిని విశ్వాసాన్ని చాటిన ఆదివాసీలు

**జూలూరుపాడు, మహా:** ఆదివాసి నాయక పోడుల కుల దేవత పెద్దమ్మతల్లి కొలుపు కార్యక్రమాన్ని మండల పరిధి పడమట నర్సాపురం గ్రామంలో అత్యంత భక్తి శ్రద్ధలతోటి నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు సాగిన పెద్దమ్మ తల్లి కొలుపు కార్యక్రమం ఆదివారం కొండాలు తొక్కుటతో ముగిసింది. శనివారం సాయంత్రం భారీ భక్త జన సందోహం నడుమ గ్రామ ప్రధాన వీధులలో సరువుల ఊరేగింపు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఆదివాసి నాయక పోడు కుల పూజారులు తమ సంస్కృతి, సాంప్రదాయ, ఆచారాలతో గణాసారులు, దేవర బాలల ఆధ్వర్యంలో పట్నాలు ఏసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పోతురాజు శిరస్సును జలధిలో కలిపి స్నానాలను ఆచరించిన అనంతరం రాజుకి పెద్దమ్మ తల్లికి గ్రామ పేరంటాల నడుమ లేళ్ళ సత్యనారాయణ రెడ్డి, కమలమ్మ దంపతుల కుమారులు లేళ్ళ అప్పిరెడ్డి, నాగిరెడ్డి దంపతులచే అత్యంత వైభవంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం రాజు, పెద్దమ్మతల్లి, పోతురాజు, బోనాలతో పూజారులు, గణబాలలు, దేవర బాలలు, యువకులు, మహిళలు (కొండాలు తొక్కి) అగ్నిగుండంలోనీ నిప్పులపై నడచి, అగ్ని పునీతమై తమ దేవతలపై ఉన్న భక్తిని, నమ్మకాన్ని, తమ ఆచార సాంప్రదాయాలను చాటారు. ఇలా కొలుపు చేయడం ద్వారా గ్రామంలోనీ ప్రజలు, పశువులు, పంటలు వృద్ధి చెంది సుభిక్షంగా ఉండటంతో పాటు, అంటువ్యాధుల భారి నుండి అతివృష్టి అనావృష్టి నుండి ఆ తల్లి కాపాడుతుందని, ప్రతి పనిలో విజయం సాధిస్తామని ఆదివాసీల నమ్మకం. ఆదివారం కొలుపు ముగింపు అనంతరం భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పెద్దమ్మ తల్లి కొలుపు అనంతరం గ్రామస్తులతోపాటు, ఇతర గ్రామాల భక్తులు అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలతోపాటు, పరిసర, సుదూర ప్రాంత ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**సి ఐ.. టి వెంకటపయ్య**

**మహా,దుమ్ముగూడెం:** యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని దుమ్ముగూడెం సీఐ టి వెంకటప్పయ్య అన్నారు. మండల పరిధిలోని అంజుబాక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజన్ 2 మండల స్థాయి క్రికెట్ పోటీలను స్థానిక సర్పంచ్ కొమరం శాంతమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సి ఐ వెంకటప్పయ్య మాట్లాడుతూ.. క్రీడలు యువతలో క్రమ శిక్షణను క్రీడా స్ఫూర్తిని పెంపొంది స్తాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. మండలంలోని ములకపాడు గ్రామంలో దుమ్ముగూడెం ఏజెన్సీ యువత కోసం క్రీడా మైదానం ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలోనే ప్రారంభం చేయడం జరుగుతుందని, ఉద్యోగరీత్యా ప్రిపరేషన్ అయ్యే యువతకు క్రీడ మైదానం ఎంతో దోహదపడుతుందని అన్నారు. చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఆయన మైదానంలో కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉబ్బ వేణు, నిర్వహ కమిటీ సభ్యులు చంటి శివ దుర్గారావు రవి సందీప్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో దేవస్థానం, ప్రభుత్వ భూముల

# ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

**సీపీఐ ఎమ్ఎల్ మాస్ లైన్ డిమాండ్**

**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలోని సీపీఐ ఎమ్ఎల్ మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర నాయకుడు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ దేవస్థానం మరియు ప్రభుత్వ భూములను పలుకుబడితో అక్రమంగా ఆక్రమించిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవస్థానం మరియు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసిన పెద్దల ఆటను అరికట్టి, ఆ భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. అయితే, బ్రతుకుదెరువు కోసం కూలినాలి చేసుకుంటూ జీవించే పేదల గుడిసెలపై చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఆదివాసి, గిరిజన చట్టాలు అమలులో ఉన్నప్పటికీ, కొందరు లంచగొండి అధికారుల సహకారంతో అవి ఉల్లంఘించబడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిసా చట్టం ప్రకారం అభివృద్ధి పనులు అమలు అయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే అడవులు, ఇసుక, నీరు, గాలి వంటి సహజ వనరుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న వారు ఎంతటి ప్రభావశీలులైనా కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, మడకం దేవయ్య, మడివి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఆదివారం కొత్తగూడెం భజన మందిర్ సెంటర్లో ఉన్న పద్మశాలి కళ్యాణ మండపంలో ఎన్నికల కన్వీనర్ పుట్టా శంకరయ్య ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా వేముల ప్రసాద్, ఉపాధ్యక్షుడుగా ఇమంది ఉదయ్ కుమార్, కార్యదర్శిగా మాచర్ల శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా మాదాసి మాధవ్ రావు, ట్రెజరర్ గా కేదాసి నవీన్, ఈసీ మెంబర్లుగా వేముల మధుకర్, సామంతుల నరేష్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎAన్నికైన కమిటీ సభ్యులకు సంఘ పెద్దలు ఆముదాల వెంకటనరసయ్య, మోతుకూరి ధర్మారావు, కనుకుంట్ల కుమార్, భోగా నారాయణ, చిప్ప శ్రీనివాస్, సత్యనారాయణ, ఇమంది ప్రసాద్, రాము, హరి కృష్ణ, రాజ్ భరత్ గణేష్ అభినందనలు తెలియజేశారు. ఈ నూతన కమిటీ ఆధ్వర్యంలో సంఘ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని పద్మశాలి సంఘ పెద్దలందరూ నూతన కమిటీని కోరారు.

# అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పేద ప్రజలకు ఉపయోగపడాలి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడాలని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, సిపిఐ జిల్లా పార్టీ కార్యదర్శి ఎస్. కె సాబీర్ పాషా అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన నూతన కమిటీ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై సూచనలు సలహాలు ఇచ్చారు. మూడు సంవత్సరాలుగా మూతపడి ఉన్నటువంటి కొత్తగూడెం అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ను కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పట్టువదలని కృషితో జిల్లా కలెక్టర్ సారథ్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేసి తన ఎమ్మెల్యే నిధుల నుండి 15 లక్షల రూపాయలను మంజూరు చేయించి దాని మరమ్మతులకు ఉపయోగపడేలా కృషి చేశారని తెలిపారు. అవసరమైతే ఇంకా అవసరమైన నిధులు ఎమ్మెల్యే నుండి మంజూరీ చేయిస్తామని పేర్కొన్నారు. ఈ అంబేద్కర్ కమ్యూనిటీ హాలు కొత్తగూడెంలోనే ఒక అందమైన భవనంగా తీర్చిదిద్ది ఎక్కువగా ఇది పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాల వారికి ఉపయోగపడే విధంగా నిర్వహించాలని ఉద్ఘాటించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవి సినీగీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ మీద ఒక కమ్యూనిటీ హాల్ అనేది ఇక్కడి దళితుల చిరకాల స్వప్నమని సుదీర్ఘకాలంగా చేసిన ఉద్యమాల ఫలితంగా ఇది ఏర్పడిందని చెప్పారు. నియమింపబడిన నూతన కమిటీ సభ్యులు కూడా ఐకమత్యంతో సంఘటితంగా ముందుకు సాగాలని, అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి భారతరత్న భారత రాజ్యాంగ సృష్టికర్త బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు సాధనకు, ప్రతిష్టకు ఘనతను తీసుకురావాలని తెలిపారు. అనంతరం మేయర్ మూడు గణేష్‌ను, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషాను, నూతనంగా అంబేద్కర్ కమిటీ హాల్ కమిటీకి అధ్యక్షుడుగా ఎన్నికైన మందా హనుమంతును పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన కమిటీ గౌరవాధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్, కూసపాటి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాసులతోపాటు నూతన అధ్యక్షుడు మంద హనుమంతు, నూతన కమిటీ డైరెక్టర్లు సీనియర్ దళిత నాయకులు సబ్బారపు మధుసూదన్ చిన్ని, అంతోటి పాల్, కొప్పరి నవతన్, కోలపురి ధర్మరాజు, పీక కృష్ణ, గుండా రమేష్, కంచర్ల జమలయ్య, నూతన కార్పొరేటర్ దాసరి (నల్ల) శ్రీనివాస్, బరిగల భూపేష్, పార్థసారథి, ఏలేటి వెంకటేశ్వర్లు, కోదాడ శ్రీనివాస్, అశోక్, రవి లతోపాటు సీనియర్ మహిళా నాయకురాళ్లు, నూతన కమిటీ డైరెక్టర్లు కనుకుంట్ల నిర్మల, కరీష రత్నకుమారి, మందా నాగమణి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# "జీవ కలం" పుస్తక ఆవిష్కరణ మరియు సమీక్షా

**భద్రాచలం మహా :** భద్రాచలం లోని రిటైర్డ్ ఫంక్షన్ హాల్ భవనంలో జీవ కలం" పుస్తక* ఆవిష్కరణ మరియు సమీక్షా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం సాహిత్యాభిమానులను ఆకట్టుకునే విధంగా అద్భుతంగా జరిగింది. ఈ సందర్భంగా రచయిత గుమ్మల వెంకటేశ్వరరావు (జీవ ) గారు మాట్లాడుతూ "జీవ కలం" పుస్తకంలోని భావజాలం, దాని అంతర్భావం, మరియు రచనకు ప్రేరణ అయిన అంశాలను విపులంగా వివరించారు. జీవకలం అంటే జీవన సారాన్ని ప్రతిబింబించే కలం అని ఆయన స్పష్టం చేశారు. తదుపరి సమీక్షకులు పోలీస్ కవి ప్రసాద్ పుస్తకంలోని ప్రతి అంశాన్ని విశ్లేషిస్తూ తండ్రి, తల్లి, భార్య, సమాజం, అహింస వంటి విలువలను ఎంతో లోతుగా, అర్థవంతంగా వివరించారు. పుస్తకంలో ప్రతిఫలించిన సామాజిక స్పృహ, మానవీయ విలువలు, మరియు జీవన సత్యాలను ఆయన స్పష్టంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో గాయ తులసీదాస్ గారు, శ్రీనివాసరావు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని సభను మరింత వైభవంగా తీర్చిదిద్దారు. మరో సమీక్షకులు కవి ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి విలువలతో కూడిన పుస్తకాలు మరిన్ని రావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. మొత్తంగా "జీవ కలం" పుస్తక ఆవిష్కరణ మరియు సమీక్షా సభ విజయవంతంగా ముగిసింది.

# అడవిలో ఉచ్చు ప్రాణం తీసింది..

**విద్యుత్ తీగ తగిలి యువకుడు మృతి..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరు అడవి ప్రాంతంలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగ ఉచ్చు ఒక యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం, కుంజా సుమన్ (25) కట్టెల కోసం అడవికి వెళ్లగా అతనితో పాటు మరికొందరు గ్రామస్తులు కూడా ఉన్నారు. ఈ క్రమంలో పెద్దపెల్లి గ్రామానికి చెందిన కొంతమంది వన్యప్రాణులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు సుమన్‌కు తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, అడవి ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేయడం ప్రమాదకరమని, ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవిలో వన్యమృగాల కోసం అమర్చిన విద్యుత్ తీగలను పోలీసులు స్వాధీనం చేసుకుని, బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నారు.

# గోనెల నానికి నంది అవార్డు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు గోనెల నాని సమాజ సేవలో చేసిన విశిష్ట కృషికి గాను నంది అవార్డు అందుకున్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆపద్బాంధవుడిగా ముందుకు వచ్చి అనేక మందికి సహాయం అందించడం ద్వారా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. కరోనా కాలంలో అవసరమైన వారికి ఆహారం, ఔషధాలు అందించడంతో పాటు ఆర్థిక సహాయం కూడా అందించి బాధితులకు అండగా నిలిచారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తోడుగా నిలిచి తన సేవాభావాన్ని చాటుకున్నారు. అలాగే వరదల సమయంలో ప్రమాదంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వారికి భోజన సదుపాయం కల్పించడం వంటి చర్యల ద్వారా గోనెల నాని విశేష సేవలు అందించారు. ఆయన సేవలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాయి. ఇప్పటివరకు 27 సార్లు రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలను కాపాడటంలో భాగస్వామి కావడం ఆయన సేవా తపనకు నిదర్శనం. సమాజ సేవలో ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గోనెల నానికి నంది అవార్డు ప్రదానం చేయడం జరిగింది. ఈ అవార్డును ఖమ్మంలో స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు, నాయకులు ఆయన సేవలను అభినందిస్తూ ప్రశంసలు కురిపించారు.

## అగ్ని ప్రమాదంలో రెండు ఇల్లు దగ్ధం.. 5 లక్షల ఆస్తి నష్టం



**మహా దుమ్ముగూడెం:** కరెంట్ షార్ట్ సర్క్యూట్ సంబంధించి రెండు ఇల్లు కాలిపోయిన సంఘటన మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఈ సంఘటన సంబంధించిన ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో రామచంద్రపురం గ్రామానికి చెందిన కల్లూరి బుచ్చమ్మ ,కల్లూరి వెంకటమ్మ చెందిన రెండు ఇల్లు అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. కరెంట్ షార్ట్ సర్క్యూట్తో ఒక్కసారిగా మంటలు వ్యాపించి వెంకటమ్మ చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమవుగా పక్కనే ఉన్నటువంటి బుచ్చమ్మకు చెందిన ఇంటికి మంటలు వ్యాపించాయి ఈలోగా చుట్టుపక్కల వాళ్ళు గ్రహించి మంటలు అదుపు చేసే ప్రయత్నం చేసిన ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు నగదు పట్టా పుస్తకాలు ఆధార్ కార్డు సంబంధిత పత్రాలు కాలిపోయాయి. సుమారు 5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. సర్వం కోల్పోయి వీధిన పడ్డామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే అదుకోవాలని వారు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన సంఘటన ప్రదేశాన్ని స్థానిక సర్పంచ్ నవీన్ సందర్శించి కుటుంబాలను ఓదార్పుతో అండగా ఉంటామని తెలిపారు.

# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..

**రైతు భరోసా నిధులపై కాంగ్రెస్ నేతల హర్షం**



**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు మంజూరు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. రైతు భరోసా నిధుల మంజూరుతో రైతులకు ఆర్థికంగా ఊరట లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, నాయకులు సౌజన్య, పూజిత, జీవి, కూచిపూడి బాబు, పాలమూరి రాజు తదితరులు పాల్గొన్నారు. పాలాభిషేకం అనంతరం నాయకులు మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# ముందస్తు అడ్మిషన్లు పై చర్యలు తీసుకోవాలి

**నేలకొండపల్లి, మహా:** పాఠశాలలో ముందస్తు అడ్మిషన్ల పై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రవేట్ విద్యా సంస్థల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్యా సంవత్సరం ఇంకా పూర్తి కాకముందే జిల్లాలో కొన్ని ప్రవేట్ పాఠశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణ ను ఆరికట్టాలని కోరారు. ఫీజుల వివరాలు పాఠశాల ముందుర బోర్డు ను ఏర్పాటు చేయాలని కోరారు. 202627 విద్యా సంవత్సరంలో ప్రవేట్ పాఠశాలల ' పై పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక పోరుబాట చేపట్టనున్నట్లు తెలిపారు. పాఠశాలల తీరు పై జిల్లా కలెక్టర్. జిల్లా విద్యాశాఖాధికారి కి పిర్యాదు 'చేయనున్నట్లు తెలిపారు. వెంటనే ముందస్తు అడ్మిషన్ల పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతం చేస్తామని హెచ్చరించారు



# వైభవంగా అల్లిపల్లికి పాదయాత్ర

- క్రీస్తు శ్రమలను స్మరిస్తూ కాలి నడకన కదిలిన రోమన్ క్యాథలిక్ సంఘస్తులు
- విచారణ గురువులు రెవ" ఫాదర్ కృపచారి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు

**సత్తుపల్లి, మహా.:** క్రీస్తు శ్రమలను పురస్కరించుకొని క్రైస్తవ భక్తులు ఫిబ్రవరి నెలలో ప్రారంభించి 40 రోజులపాటు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు కొనసాగిస్తారు. ప్రపంచమంతా జరుపుకునే గుడ్ ఫ్రైడే క్రీస్తు శ్రమల కాలాన్ని పురస్కరించుకొని దానికి ముందస్తుగా సత్తుపల్లి మౌంట్ కార్మెల్ చర్చ్ ఆధ్వర్యంలో అల్లిపల్లి మరియమాత సన్నిధికి క్రైస్తవ భక్తులు కాలినడకన పాదయాత్ర నిర్వహించారు. దారి పొడవునా భక్తి గీతాలు ఆలపిస్తూ జపమాల చదువుతూ కదిలారు. సుమారు 30 కిలోమీటర్లు సాగిన పాదయాత్రలో వృద్ధులు సైతం పాల్గొనడం విశేషం. అల్లిపల్లి కొండపై రెవ" ఫాదర్ మనోజ్, రెవ" ఫాదర్ మ్యారియో , రెవ"ఫాదర్ కృపాచారి, సహాయక గురువులు రెవ" ఫాదర్ జార్నేష్ దివ్య బలి పూజ నిర్వహించి భక్తులకు ఆశీర్వాదం అందజేశారు. అనంతరం కిష్టాపురం గ్రామ సంఘస్తులు పాదయాత్ర నిర్వహించి అల్లిపల్లి చేరిన భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రోమన్ క్యాథలిక్ సంఘస్తులు, ఇతర సంఘాల క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్టీయూసి ద్వారానే
# కార్మికుల హక్కులకు రక్షణ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కేవలం ఐఎన్టీయూసీ ద్వారానే సాధ్యమని సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ అన్నారు. ఆదివారం ఐఎన్టియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూపాలపల్లిలో మెడికల్ బోర్డు నిలిపివేత అంశంపై స్వయంగా ముఖ్యమంత్రి నిలిపి వేయలేదని చెప్పినప్పటికీ యాజమాన్యంతో మాట్లాడి పునరుద్ధరణ చేయించలేని స్థితిలో ఉన్న ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఏఐటీయూసీ చేతగానితనాన్ని కార్మికులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులు హక్కులు సంక్షేమాన్ని సమర్థంగా కాపాడగల సామర్థ్యం కేవలం ఐఎన్టీయూసీకే ఉందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఆదాయపన్ను మాఫీ, కార్మికులకు సొంత ఇంటి పథకం, మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి అంశాలను ఐఎన్టీయూసీ నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందని తెలిపారు. ఐఎన్టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఈ సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు పూర్తయిన కార్మికుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ఏఐటీయూసీ రాజకీయ ప్రయోజనాలకే పరిమితమైందని ఘాటుగా విమర్శించారు. గుర్తింపు సంఘాలు విఫలమైన ఏఐటియుసి ఇప్పుడు ధర్నాలు దొంగ దీక్షల పేరుతో కార్మికులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ సహకారంతో గెలిచిన ఒక్క ఎమ్మెల్యే ఆధారంగా సింగరేణిలో రాజకీయ జోక్యం చేస్తూ అదే సమయంలో కాంగ్రెస్ పై విమర్శలు చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికలలో అక్రమ పొత్తులు స్ట్రక్చర్ మీటింగ్ ను బహిష్కరించడం వంటి చర్యలు కార్మిక సంఘాల బాధ్యతలకు విరుద్ధమని అన్నారు. అనంతరం ఐఎన్టీయూసీ చొరవతోనే మళ్లీ సమావేశం ఏర్పాటు చేయించామని తెలిపారు. కాంగ్రెస్ మద్దతు తీసుకుంటూనే అదే పార్టీని విమర్శించడం సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు భట్టి విక్రమార్క శ్రీధర్ బాబు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చల ద్వారా సింగరేణి కార్మికుల సంక్షేమానికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. వాటిలో ముఖ్యంగా ఉద్యోగాల వయోపరిమితిని 35 నుండి 40 సంవత్సరాలకు పెంపు, కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అమలు, కోటి ప్రమాద బీమా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, నైనీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభం వంటి ముఖ్యమైన చర్యలు అమలు చేసినట్టు వివరించారు. అదేవిధంగా కార్మికుల సొంతింటి పథకం ఆదాయ పన్ను మాఫీ వంటి ఎన్నికల హామీల అమలుపై మంత్రులతో విస్తృతంగా చర్చించామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే వాటికి పరిష్కారం చూపుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఈ హామీల సాధన కోసం ఐఎన్టీయూసీ నాయకులు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఆల్బర్ట్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పీతాంబరావు, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.రాజేశ్వరరావు, సెంట్రల్ కమిటీ మెంబర్స్ రాజేశ్వరరావు, కొమరయ్య, పోశం శ్రీనివాస్ మెయిన్ హాస్పిటల్ సెక్రటరీ, సురేందర్ బాబు జేవిఆర్ఓసి ఫిట్ సెక్రటరీ, సీతారామరాజు, ఎస్ రాజు, మోహన్, రాయమల్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో ఓబి కంపెనీల
# వోల్వో డ్రైవర్లు..

- **ఫిట్‌నెస్ లేని వాహనాలతో పొంచి ఉన్న ముప్పు..**
- **ఉపన్యాసాలకేనా..! ఆర్టీఏ నిబంధనలు..?**
- **ఆర్టీఏ అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్..**
- **రేణుక అక్షర మహిళా మండలి నేత పూనెం సరోజ..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఏరియాలో పనిచేస్తున్న దుర్గ, గౌరవ్ ఓబీ కంపెనీల్లో నడుస్తున్న వోల్వో వాహనాలు ఫిట్‌నెస్ లేకుండానే నడుస్తున్నాయని మణుగూరు రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ ఆరోపించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కనీస భద్రతా నిబంధనలు పాటించకుండా కొంతకాలంగా ఓబీ కంపెనీల యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. వోల్వో వాహనాల్లో ఉండాల్సిన కనీస సౌకర్యాలు కూడా లేకుండా డ్రైవర్లతో ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. డ్రైవర్లు కూర్చునే సీట్లు సరిగా లేకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, నిజాలు బయటకు చెబితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని డ్రైవర్లను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నట్లు వ్యవహరిస్తూ, మణుగూరుకు కూడా రాకుండా ఓబీ కంపెనీల నిర్వాహకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని సరోజ విమర్శించారు. రక్షణ చర్యలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మరోవైపు ఇసుక ర్యాంపుల వద్ద పరిస్థితి మరింత దారుణంగా ఉందని, అక్కడికి వచ్చే లారీ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.లక్షల రూపాయల జీతాలు తీసుకునే అధికారులు అక్రమాలకు పాల్పడడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రశ్నించారు. డ్రైవర్లకు నిబంధనల పేరుతో ఉపన్యాసాలు ఇచ్చే సంబంధిత శాఖలు ముందుగా ఓబీ కంపెనీల్లో వాహనాల ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.మణుగూరు ఓబీ కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలు బయటకు రాకుండా సింగరేణి అధికారులు, ఓబీ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ తన విధులను సక్రమంగా నిర్వహిస్తే ప్రమాదాలకు తావుండదని అన్నారు.ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించి ఫిట్‌నెస్ లేని వాహనాలను తొలగించి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రేణుక అక్షర మహిళా మండలి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎండీ షబానా, కోరి శ్యామల, దేరంగుల సుజత, కన్నాపురం వసంత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## తోకల రమేష్ కు స్వర్ణ నంది
# ఉగాది పురస్కారం ..

- **కోలాటం మాస్టర్‌కు ఘన సత్కారం..**
- **కళా, సాహిత్య సేవలకు గుర్తింపు..**



**మణుగూరు / అశ్వాపురం మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామానికి చెందిన ప్రముఖ కోలాటం మాస్టర్, కవి, గాయకుడు, ఐటీసీ ఉద్యోగి తోకల రమేష్ ప్రతిష్టాత్మక స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందుకున్నారు. ఖమ్మంలోని శ్రీ రామాలయం ప్రాంగణంలో రామగిరి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించిన ఉగాది స్వర్ణ నంది పురస్కారాల వేడుకలో ఈ అవార్డు ఆయనకు అందజేశారు.ఇటీవల తిరుపతిలో నేషనల్ సేవా రత్న అవార్డు అందుకున్న రమేష్‌కు ఈ సత్కారం మరింత గౌరవాన్ని తీసుకొచ్చింది. సభా వేదికపై ప్రముఖ దర్శకుడు, రచయిత, నటుడు ఎన్ కాంతేశ్వరరావు, సినీ రచయిత కోమాకుల సీతారాములు, ఉత్తమ కవిరత్న తోటమళ్ళ సురేష్ బాబు, ఈటీవీ పాడుతా తీయగా న్యాయనిర్ణేత రాజబాబు తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించి, స్వర్ణ నంది జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయినా, అనేక కష్టాలను అధిగమిస్తూ స్వయంకృషితో ఎదిగిన రమేష్, తన రచనలు, జానపద కోలాటం ద్వారా సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. ఐటీసీ ఉద్యోగిగా పనిచేస్తూనే సామాజిక సేవలు అందిస్తూ, గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ కొత్త తరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. అవార్డు స్వీకరించిన అనంతరం తోకల రమేష్ మాట్లాడుతూ, ఈ పురస్కారం నా గురువులకు, ఐటీసీ సంస్థకు అంకితం. నా గ్రామం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇకముందు కూడా కళా, సాహిత్య, సామాజిక సేవల ద్వారా సమాజానికి సేవ చేస్తాను అని తెలిపారు. స్వర్ణ నంది ఉగాది పురస్కారం అందుకున్న రమేష్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్తులు, తోటి ఉద్యోగులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఖమ్మం అధ్యక్షుడు కురవిళ్ల ప్రవీణ్, బలగం ఫేమ్ కుర్తానందం, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పాలకుర్తి కృష్ణ, కన్వీనర్ ప్రముఖ కమెడియన్ మొగిలి గుణకర్, కో కన్వీనర్ సినీ నటుడు నాగ సాయి, డైరెక్టర్ రవి తోప్, గాయకుడు కోదాడ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ వేముల వీరేశంనుకలిసినా ఉద్యమకారులు



**భువనగిరి, మహా :** నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ను ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారుడు కాంబ్లిశ్రీధర్మంటి రమేష్ మంటి శంకర్ షేక్ అజ్జు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు అగ్రనేత దుబాషి శంకర్‌కు తీవ్రఅనారోగ్యం

- **జైల్లో చికిత్సలు అందిస్తున్న అధికారులు**
- **ఆందోళనలో కుటుంబ సభ్యులు**



**కుషాయిగూడ, మహా :** ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని సెంట్రల్ జైలులో గత ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా ఉన్న సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు దుబాషి శంకర్ అలియాస్ మహేందర్ అలియాస్ రమేష్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నాడు.గత కొన్ని రోజులుగా జైలులోనే అతనికి కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రంగా పెరిగింది. విశాఖపట్నం జిల్లా గొల్లపల్లి ప్రాంతంలో 2014లో జరిగిన ఎదురు కాల్పుల్లో కుడి కాలుకు గాయపడినప్పటి నుంచి అతడు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం ఆ గాయం మళ్లీ ఇన్ఫెక్షన్‌కు గురవడంతో పరిస్థితి మరింత విషమించింది.ఇప్పటికే రెండు రోజులుగా కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రత పెరగడంతో భువనేశ్వర్ సెంట్రల్ జైలు అధికారులు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇంతకుముందు కూడా ఒకసారి అతడు తీవ్ర అనారోగ్యానికి గురికాగా జైలు అధికారులు చికిత్సలు అందించారు.దుబాషి శంకర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కలిపి 100కు పైగా కేసులు నమోదయ్యాయి. అలిపిరి, ఉమేష్ చంద్ర, వ్యాస్ హత్య కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబా షి శంకర్ గత 45 ఏళ్లుగా విప్లవ ఉద్యమంలో ఒడిస్సా ఏఓబి లో కొనసాగుతున్నాడు దుబాషి శంకర్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు 2018 లో ఒరిస్సా రామడుగు లో జరిగిన ఎన్కౌంటర్లో దుబాషి శంకర్ సహచరి లత ఎన్కౌంటర్ లో చనిపోయింది


## ఆదివాసుల హక్కును కాలరాస్తున్న లంబాడిలు




**కుషాయిగూడ, మహా :** ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) మహబూబాబాద్ జిల్లా సమావేశానికి హాజరవుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ గారిని అక్రమ అరెస్టును ఖండించిన ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ సాగబోయిన పాపారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దేశ మూలవాసులు స్వేచ్ఛగా జీవించే హక్కును భారత రాజ్యాంగం కల్పిస్తే... అందుకు భిన్నంగా తెలంగాణలో లంబడోళ్ళ రాజ్యం నడుస్తుందా అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. లంబాడాలు అధికారం ఉందని, అధికారులు మా వాళ్లే అని కుట్రలు చేస్తూ ఆదివాసీ ఉద్యమాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆదివాసులకు సమావేశాలు పెట్టుకునే హక్కు కూడా లేదనే విధంగా మహబూబాబాద్ పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల మండిపడ్డారు. తుడుం దెబ్బ జిల్లా కమిటీ సమావేశానికి హాజరవుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు బాబన్నను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే పోలీసులు అరెస్టు చేసిన తుడుం దెబ్బ నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆదివాసి విద్యార్థులు ఆందోళన, పోరాటాలకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఆదివాసుల ఫలాలు రిజర్వేషన్లు లంబాడీలు కొట్టేస్తున్నారని పాపారావు మండిపడ్డారు ఆదివాసులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు ఆదివాసులు అడవిని నమ్ముకొని బతుకుతున్నారని ప్రభుత్వం నుండి ఒక్క సంక్షేమ పథకాలు కూడా అందరం లేదని పాపారావు మండిపడ్డారు.

## గల్ఫ్ మంటల్లోనూ చల్లని కబురు

**ఢిల్లీ, మహా:** మధ్యప్రాచ్యంలో రగులుతున్న యుద్ధ జ్వాలలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ముడిచమురు, గ్యాస్ సరఫరాలకు కీలకమైన గల్ఫ్ ప్రాంతం బాంబుల మోతతో దద్దరిల్లుతుంటే, ఆ ప్రభావం సామాన్యుడి వంటగదిపై పడుతుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమైంది. ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ లాంటి వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధి గుండా నౌకలు వెళ్లాలంటేనే భయపడుతున్న ఈ గడ్డు కాలంలో, భారతదేశం వేసిన మాస్టర్ స్ట్రోక్ దేశ ప్రజలకు భారీ ఊరటనిచ్చింది. గల్ఫ్ కష్టాలకు ఏమాత్రం బెదరకుండా, ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇంధన భద్రతను ఖాయం చేసుకున్న తీరు ఇప్పుడు సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది. గల్ఫ్ దేశాలపైనే పూర్తిగా ఆధారపడకుండా, సుదూర ప్రాంతమైన అమెరికాలోని టెక్సాస్ నుంచి భారత్ ఎల్పీజీని దిగుమతి చేసుకోవడం ఈ వ్యూహంలో అత్యంత కీలకమైన అడుగు. అమెరికా నుంచి 16,714 టన్నుల ఎల్పీజీతో బయలుదేరిన భారీ నౌక 'పిక్సిస్ పయనీర్' ఎలాంటి ఆటంకాలు లేకుండా కర్ణాటకలోని న్యూ మంగళూరు పోర్టుకు విజయవంతంగా చేరుకుంది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, దేశంలో ఎల్పీజీ కొరత ముప్పును శాశ్వతంగా తప్పించేలా రానున్న వారంలో ఏకంగా 72,700 టన్నుల గ్యాస్ అందుబాటులోకి రానుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 25న 'అపోలో ఓషన్' నౌక ద్వారా 26,687 టన్నులు, ఆ తర్వాత 29న మరో నౌక ద్వారా ఏకంగా 30 వేల టన్నుల ఎల్పీజీ భారత తీరాన్ని తాకనుంది.సాధారణంగా ఇలాంటి భౌగోళిక రాజకీయ సంక్షోభ సమయాల్లో బీమా ఖర్చులు, రవాణా ఛార్జీలు ఆకాశాన్ని అంటుతాయి. ఆ భారం అంతిమంగా సామాన్య వినియోగదారుడిపై పడుతుంది. ఇక్కడే కేంద్ర ప్రభుత్వం తన సమయస్ఫూర్తిని ప్రదర్శించింది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇంధన కంపెనీలకు అండగా నిలుస్తూ, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ మార్చి 14 నుంచి 31 వరకు ముడి చమురు, ఎల్పీజీ రవాణాపై కార్గో ఛార్జీలను పూర్తిగా మాఫీ చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.



# రూ. 15 వేలు జీతంలో ఆనందం.. రూ. 2.5 లక్షల్లో అసంతృప్తి!



జీతం ఎక్కువ వచ్చే జాబ్ చేస్తే.. సంతోషంగా ఉంటుందని అందరూ అనుకుంటారు. అది ఏ మాత్రం నిజం కాదంటూ, వచ్చే జీతానికి సంతోషానికి సంబంధం ఉండదని ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు. ఇది ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ''నాకు నిజంగా ఆనందం కలిగింది.. నెలకు 15,000 రూపాయల జీతం పొందిన సమయంలోనే. కానీ ఇప్పుడు నెలకు 2.5 లక్షల రూపాయలు సంపాదిస్తున్నప్పటికీ, సంతృప్తి తగ్గిపోయింది'' అని ఎక్స్ యూజర్ సాక్షి వెల్లడించారు. ఇది డబ్బు ఎక్కువ కావడం వల్ల కాదు, ఇతరుల జీవన స్థితులతో తనను పోల్చుకోవడం వల్ల ఏర్పడిన అసంతృప్తి అని ఆమె పేర్కొన్నారు. ఉద్యోగం వదిలిన తర్వాత కొన్ని నెలలు జీతం లేకపోవడం వల్ల ప్రారంభంలో కొన్ని కష్టాలు ఎదుర్కొన్నా, అది నిజాన్ని గ్రహింపజేసింది. నిజమైన సంతోషం అంటే ఎక్కువ జీతం పొందడంలో కాదు, మనం నిజంగా ఇష్టపడే పని చేయడంలో ఉందని. ఇప్పుడు నేను ఇతరుల గురించి ఆలోచించకుండా పనిచేస్తాను. ఆమె అభిప్రాయం ప్రకారం, "పెద్ద జీతం లేదా తక్కువ జీతం కాదు, జీవితాన్ని ఎలా గడపాలనుకుంటున్నావో అనేది ముఖ్యం.

# హీట్‌కు హాట్ సొల్యూషన్: ఇదిగో కూల్ గ్యాడ్జెట్లు!

వేసవి వచ్చిందంటే బయట అడుగు పెడితే చాలు, సూర్యుడు తన వేడి గాలిని ముఖంపై కొడుతూ 'ఇంట్లోనే ఉండు' అని హెచ్చరిస్తూనే ఉంటాడు. కాని, టెక్నాలజీ తెచ్చిన ఈ చిన్న గ్యాడ్జెట్లు, సూర్యుడు తన వేడి ఎంత పెరిగినా 'ఊఫ్' నుంచి 'ఆహా!'గా మార్చేస్తాయి.



**ఫోనుకి బుజ్జి ఏసీ!**

సమ్మర్‌లో గేమ్స్ ఆడుతున్నప్పుడు లేదా వీడియోలు చూస్తున్నప్పుడు మీ ఫోన్ వేడి పెనంలా మారిపోతుందా? అయితే మీ ఫోన్ చల్లబరచడానికి వచ్చేసింది ఈ మొబైల్ కూలింగ్ ప్యాడ్! ఇది మామూలు ఫ్యాన్ కాదు, ఇందులో ఉన్న అడ్వాన్స్డ్ సెమీ కండక్టర్ టెక్నాలజీ మీ ఫోన్ టెంపరేచర్‌ను కేవలం సెకన్లలోనే తగ్గించేస్తుంది. అంటే బయట ఎండలు మండిపోతున్నా, మీ ఫోన్ మాత్రం వింటర్ వాతావరణంలో ఉన్నట్టే చిల్ అవుతుంది! దీనికి ఉన్న ఎల్‌ఈడీ డిస్‌ప్లే ఫోన్ ఎంత చల్లగా ఉందో ఎప్పటికప్పుడు చూపిస్తుంది. పైగా ఇందులోని మ్యాగ్నెట్ ఫీచర్ వల్ల ఫోన్ వెనుక సులభంగా అతుక్కుపోతుంది, మీరు గంటల తరబడి గేమింగ్ చేసినా లేదా లైవ్ స్ట్రీమింగ్ చేసినా ఫోన్ హ్యాంగ్ అవ్వదు, బ్యాటరీ కూడా వేడెక్కదు. ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్.. ఏదైనా సరే, సెట్ అయిపోతుంది. ధర రూ. 700 మాత్రమే!


**మ్యాజిక్ గ్లాసెస్!**

ఫోన్ చూసి చూసి మీ కళ్లు 'ఫ్రై' అయిపోతున్నాయా? బయటకి వెళ్దామంటే సూర్యుడు సెగలతో సినిమా చూపిస్తున్నాడా? ఇలా ఒకేసారి కళ్లకు రక్షణ, మైండ్‌కి రిలాక్సేషన్ ఇచ్చేందుకు వచ్చేసింది ఈ స్మార్ట్ బ్లూటూత్ గ్లాసెస్! ఇందులో ఇన్-బిల్ట్ స్పీకర్లు కూడా ఉన్నాయి. అంటే మీరు కళ్లజోడు పెట్టుకుంటే చాలు, పక్కన ఎవరికీ వినిపించకుండా మీ చెవుల్లో మ్యూజిక్ వినిపిస్తుంది. ఫోన్ తీయకుండానే కాల్స్ కూడా మాట్లాడేయొచ్చు. సాంగ్స్ మార్చుకోవచ్చు. ఇక ఇందులో ఉన్న ఫోటోక్రోమిక్ లెన్సులు ఇంట్లో ఉన్నప్పుడు బ్లూ లైట్ నుంచి, అదే అడుగు బయట పెట్టగానే సెకన్లలో కూలింగ్ గ్లాసెస్‌లా మారి కళ్లకు రక్షణ ఇస్తాయి. పైగా వర్షం పడినా, చెమట పట్టినా ఏమీ కాకుండా దీనికి వాటర్ రెసిస్టెన్స్ కూడా ఉంది. ధర రూ. 1,200 మాత్రమే!

**మంచు కురిపించే గొడుగు!**


బయట ఎండలు మండిపోతుంటే.. గొడుగు పట్టుకున్నా సెగలు తగులుతూ చిరాగ్గా ఉందా? అయితే మీ పర్సనల్ ఏసీలాంటి ఈ బీఎన్ఎఫ్ సన్ అంబ్రెల్లాని చూస్తే మీరు ఫిదా అయిపోతారు! దీని లోపల ఒక బుజ్జి ఫ్యాన్ ఉండటమే కాకుండా, ఇది చల్లని నీటిని మంచులా చల్లుతుంది. అంటే ఎండలో వెళ్తున్నా, మీ గొడుగు కింద ఒక చిన్న మంచువాన కురుస్తుంది. కేవలం నాలుగు ఏఏ బ్యాటరీలు ఉంటే చాలు.. గాలికి తిరగబడని విండ్‌ప్రూఫ్ డిజైన్‌తో, అటు గాలిని.. ఇటు మంచు జల్లులను మీకు అందిస్తుంది. ఫ్రెండ్స్‌కి గిఫ్ట్ ఇవ్వడానికి కూడా ఇది ఒక అదిరిపోయే ఆప్షన్. ధర రూ. 5,900.

# ఇన్‌ఫ్రా స్పీడుకు బ్రేకులు.. పడిపోయిన వృద్ధి



**న్యూఢిల్లీ:** కీలకమైన ఎనిమిది మౌలిక రంగాల గ్రూప్ వృద్ధి ఫిబ్రవరిలో మూడు నెలల కనిష్టానికి నెమ్మదించింది. రిఫైనరీ ఉత్పత్తులు, ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించడంతో 2.3 శాతానికి పరిమితమైంది. గతేడాది ఫిబ్రవరిలో ఇది 3.4 శాతంగా నమోదైంది. కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం తాజాగా ఫిబ్రవరిలో ఎరువులు, సిమెంటు, విద్యుదుత్పత్తి వరుసగా 3.4 శాతం, 9.3 శాతం, 0.5 శాతం మేర క్షీణించింది. అయితే బొగ్గు, ఉక్కు ఉత్పత్తి మాత్రం మెరుగ్గా నమోదైంది. ఇక ఏప్రిల్-ఫిబ్రవరి మధ్యకాలంలో ఇన్‌ఫ్రా వృద్ధి 2.9 శాతానికి పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధిలో 4.4 శాతంగా నమోదైంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు తలెత్తడానికి ముందు నుంచే కీలక రంగాల వృద్ధి నెమ్మదించిందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా చీఫ్ ఎకానమిస్ట్ అదితి నాయర్ తెలిపారు.

# ఉద్యోగులకు ఏఐ ట్రైనింగ్.. పియర్సన్‌తో టీసీఎస్ జట్టు




**ముంబై:** గ్లోబల్ లెర్నింగ్ సర్వీసుల సంస్థ పియర్సన్‌తో ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జట్టు కట్టింది. కృత్రిమ మేధతో సిబ్బందికి శిక్షణనిచ్చి, వారిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవడంలో కంపెనీలకు తోడ్పాటు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడనుంది. ఇందుకోసం ఇరు సంస్థలు ఏఐ ఆధారిత లెర్నింగ్ ప్రోడక్టులు, సర్వీసులను రూపొందిస్తాయి. నియామకాల్లో, సిబ్బంది అభివృద్ధి ప్రోగ్రాంలలో అభ్యర్థుల సామర్థ్యాలను మదింపు చేసే ప్రక్రియలో పియర్సన్‌కి చెందిన వెర్సాంట్ ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ విధానాన్ని టీసీఎస్ ఉపయోగించనుంది. మరోవైపు అంతర్జాతీయ ట్రావెల్ సర్వీసులను డిజిటలీకరించే దిశగా ప్రముఖ ట్రావెల్ టెక్నాలజీ సంస్థ అమెడ్యూస్‌తో టీసీఎస్ చేతులు కలిపింది. మరోవైపు, ఐటీ ఇన్‌ఫ్రా, డేటా సెంటర్లు, ఇతరత్రా టెక్నాలజీల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే దిశగా ఆటోమేషన్ దిగ్గజం ఏబీబీ, టీసీఎస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

# సిబిల్ స్కోరుపై పెరుగుతున్న అవగాహన




**ముంబై:** రుణాల విషయంలో కీలక పాత్ర పోషిస్తున్న క్రెడిట్ స్కోరు గురించి తెలుసుకోవడంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని ట్రాన్స్‌యూనియన్ సిబిల్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రకారం 18.3 కోట్ల మంది భారతీయులు తమ సిబిల్ స్కోరును స్వయంగా పరిశీలించుకుంటున్నారు. తొలిసారిగా పరిశీలించుకునే వారి సంఖ్య గతేడాది డిసెంబర్ గణాంకాల ప్రకారం వార్షికంగా 27 శాతం పెరిగింది. క్రెడిట్ మానిటరింగ్ చేసుకుంటున్న వారి సగటు స్కోరు 728గా ఉంది. ఇలా పర్యవేక్షించుకుంటున్న వారిలో సుమారు 45 శాతం మంది ఆరు నెలల వ్యవధిలో తమ స్కోరును మరింత మెరుగుపర్చుకుంటున్నారు. సాధారణంగా వ్యక్తిగత రుణాల్లాంటివి అవసరమైనప్పుడు మాత్రమే వినియోగదారులు స్కోరును తెలుసుకునే వారని, కానీ ప్రస్తుతం తరచుగా తెలుసుకోవడం, దాన్ని మెరుగుపర్చుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నారని సంస్థ ఎండీ భవేష్ జైన్ తెలిపారు. మిలీనియల్స్, జెన్ జెడ్ తరం, మహిళలు ఈ విషయంలో ముందుంటున్నారని పేర్కొన్నారు. మెట్రోయేతర ప్రాంతాల్లో స్కోరు ను పరిశీలించుకునే ధోరణి పెరుగుతోందన్నారు.




# దెబ్బకు దెబ్బ తీస్తాం..


## అమెరికాపై ఇరాన్ కౌంటర్ అటాక్




అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య యుద్ధం సవాళ్లుప్రతి సవాళ్ల మధ్య తారాస్థాయికి చేరింది. 48 గంటల్లో హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోతే ఇంధన కేంద్రాలను ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తామని అమెరికా వార్నింగ్ ఇవ్వగా.. ఇరాన్ తొలుత మెత్తబడినట్లే కనిపించి, ఆతర్వాత గట్టి కౌంటరిచ్చింది. ఇరాన్ శత్రు దేశాలకు చెందిన నౌకలు తప్ప, మిగతా అన్ని నౌకలు హర్మూజ్ జలసంధి ద్వారా వెళ్లవచ్చని ప్రకటించిన ఇరాన్.. అమెరికా మా ఇంధన కేంద్రాలపై దాడులు చేస్తే, హర్మూజ్ జలసంధి పూర్తిగా మూతపడుతుందని వార్నింగ్ ఇచ్చింది. అలాగే మధ్యప్రాచ్య మౌలిక సదుపాయాలను కోలుకోలేని విధంగా నాశనం చేస్తామని హెచ్చరించింది. అమెరికా 48 గంటల వార్నింగ్ ఇచ్చిన కొద్ది గంటల్లో ఇరాన్ మిలిటరీ ఈ ప్రకటన చేసింది. దీన్ని బట్టి చూస్తే, అమెరికా వార్నింగ్‌లకు ఇరాన్ బెదిరేలా కనిపించడం లేదు. దెబ్బకు దెబ్బ తీసేలా కనిపిస్తుంది.

**ఊపిరి పీల్చుకున్న ప్రపంచం**

హర్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్ తొలుత చేసిన ప్రకటన వల్ల ప్రపంచం మొత్తం ఊపిరి పీల్చుకుంది. ముడి చమురు, సహజ వాయువు సరఫరా అంతరాయం లేకుండా కొనసాగుతుందనే నమ్మకం కలిగింది. ధరల పెరుగుదలపై ఆందోళనలు కూడా ఒకింత తగ్గాయి. అయితే ఇరాన్ తాజా ప్రకటన తర్వాత పరిస్థితి మొదటికొచ్చింది.



# ఒమన్‌లో పెను విషాదం

ఒమన్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. రుస్తాక్ విలాయత్‌లోని అల్ హైమాలి ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు చిన్నారులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలై, ప్రాణాల కోసం పోరాడుతున్నారు. పాడుబడిన ఓ మట్టి భవనం కూలిపోవడంతో ఈ విషాదం చోటు చేసుకుంది. ప్రమాద సమయంలో చిన్నారులు భవనంలో ఆడుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఒమన్‌లో గతంలో కూడా పాడుబడిన భవనాలు, గోడలు కూలి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈసారి చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అక్కడి వారిని కలచివేసింది. గ్రామస్థులు ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మరోపక్క ఒమన్ ఇరాన్ మిస్సైల్ దాడులతో సతమతమవుతుంది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతిరోజు ఒమన్‌పై దాడులు చేస్తుంది. ఒమన్‌తో నేరుగా ఎలాంటి గొడవలు లేనప్పటికీ.. అమెరికాఇజ్రాయెల్‌కు మద్దతిస్తున్న కారణంగా ఇరాన్ దాడులు చేస్తుంది. ఫిబ్రవరి 28 నుంచి ఇజ్రాయెల్,అమెరికాఇరాన్ మధ్య యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే.

# గజగజా వణికించే ఎఫ్-35ని ఇరాన్ సింపుల్‌గా ఇలా కొట్టింది..



**టెహ్రాన్:** ప్రపంచంలో అత్యంత ఆధునిక, అత్యంత ఖరీదైన ఫైటర్ జెట్‌గా పేరుగాంచిన ఎఫ్35ను ఇరాన్ ఎలా గుర్తించింది, ఎలా పేల్చేసింది? ఎఫ్35 శత్రు రాడార్లకు చిక్కదు. ఈ స్టెల్త్ యుద్ధ విమాన ధర రూ.7001,000 కోట్ల మధ్య ఉంటుంది. అయినప్పటికీ, ఇరాన్ దాని పని పట్టింది. ఇరాన్‌కు ఇది ఎలా సాధ్యమైందన్న దానిపై పై పలు రకాల విశ్లేషణలు వస్తున్నాయి. తాజాగా, 44 సెకన్ల ఓ యానిమేటెడ్ క్లిప్ దీన్ని కొత్త కోణంలో విశ్లేషించి చూపించింది. రాడార్ సంకేతాలపై ఆధారపడకుండా ఇరాన్ ప్యాసివ్ ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లపై ఆధారపడి ఉండొచ్చు. అంటే, ఏదైనా వస్తువు నుంచి వెలువడే వేడి (ఉష్ణం)ని గుర్తించి, ఆ వేడి ఆధారంగా ఆ వస్తువు ఎక్కడ ఉంది? ఎలా కదులుతోంది? అనేది దీని ద్వారా గుర్తించొచ్చు. ఉదాహరణకు జెట్ ఇంజిన్ చాలా వేడిని విడుదల చేస్తుంది. ఆ వేడిని సెన్సర్లు గుర్తించి, ఆ జెట్ స్థానాన్ని తెలుసుకుంటాయి. దీంతో పైలట్లకు ఇరాన్ సైనికులు తమను గమనిస్తున్నారని తెలియకపోవచ్చు. ఇరాన్ ఎఫ్16ను కూడా దెబ్బతీసినట్లు ప్రకటించింది. నిన్న ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ దేశ మధ్యభాగంపై ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్16 ఫైటర్ జెట్‌ను లక్ష్యంగా చేసుకున్నామని ప్రకటించాయి. "జయోనిస్టు పాలనకు చెందిన ఎఫ్16 శత్రు ఫైటర్ జెట్‌ను ఉదయం 3.45 గంటలకు దెబ్బతీశాం" అని గార్డ్స్ తమ సెపా న్యూస్ వెబ్‌సైట్‌లో తెలిపాయి. ఇరాన్ మీడియా ఆకాశంలో పొగ కనిపిస్తున్న చిత్రాన్ని విడుదల చేసి, మరో విమానాన్ని లక్ష్యంగా చేసుకున్నామని తెలిపింది, కానీ అది ఏ రకమో లేదా ఇజ్రాయెల్‌దా, అమెరికాదా అన్నది కూడా వెల్లడించలేదు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ యానిమేషన్ వీడియో నిశ్శబ్ద ప్యాసివ్ గుర్తింపు సిద్ధాంతాన్ని చూపుతోంది. టెక్ వ్యాఖ్యాత ఫుర్కాన్ గోజుకారా ఎక్స్‌లో పంచుకున్న ఈ క్లిప్ ఈ విషయాన్ని వివరిస్తుంది. తరంగాలను విడుదల చేసే రాడార్ వ్యవస్థలతో భిన్నంగా, ప్యాసివ్ ఇన్‌ఫ్రారెడ్ వ్యవస్థలు నిశ్శబ్దంగా ఉండి, ముఖ్యంగా జెట్ ఇంజిన్ల నుంచి వచ్చే వేడిని గుర్తిస్తాయి. యానిమేషన్‌లో ప్రకాశించే గుర్తులు విమానం ప్రయాణ మార్గాన్ని చూపుతాయి, సెన్సర్లు ఎటువంటి హెచ్చరిక లేకుండా లక్ష్యాన్ని పట్టుకుంటాయి. ఏ సంకేతం ప్రసారం కాకపోవడంతో విమానంలో ఉన్న హెచ్చరిక వ్యవస్థలు అలర్ట్ ఇవ్వవు.



# రికార్డు సృష్టించిన పాక్.. ఏ విషయంలో తెలుసా?

**పాకిస్థాన్‌కు తన చేస్తున్న పనులకు తగిన గౌరవం లభించింది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో మొదటి స్థానానికి చేరుకొని రికార్డు సృష్టించింది. గత కొన్ని సంవత్సరాలుగా టాఫ్ ప్లేసులో ఉన్న ఈ దేశం ఇప్పుడు ఏకంగా మొదటి స్థానానికి చేరుకొని అశాంతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది.**

పాకిస్థాన్ గురించి ప్రపంచానికి తెలియజేయడానికి భారత్ ఇంతకాలం శాయశక్తులా ప్రయత్నిస్తూ వచ్చింది. దాయాది దేశం కపటబుద్ధిని ఉగ్రవాదులకు కల్పిస్తున్న అండదండలను అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలకు తెలియజేసింది. అయినప్పటికీ పాక్ తన వక్రబుద్ధిని మార్చుకోకుండా భారత్‌పై విషం చిమ్ముతూ వచ్చింది. కాగా తాజాగా విడుదలైన గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2026లో పాకిస్థాన్ మొదటి స్థానం దక్కించుకుంది. దీంతో ఆదేశంలో ఉగ్రవాదం ఏ స్థాయిలో ఉందో అంతర్జాతీయ సమాజానికి తేటతెల్లమయ్యింది. కాగా గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో భారత్ 13వ స్థానంలో నిలిచింది. గత ఏడాది కాలంగా దేశంలో ఉగ్రవాద ఘటనలు 44 శాతం తగ్గాయని పేర్కొంది. క్రితంతో పోలిస్తే 2025లో ఉగ్రవాద మరణాలు 28 శాతం తగ్గాయి. ఉగ్రదాడుల సంఖ్య 22శాతం తగ్గి 2,944కు చేరుకుంది. 81 దేశాలలో పరిస్థితి మెరుగుపడగా 19 దేశాలలో పరిస్థితి మరింత దిగజారింది. అదే సమయంలో ప్రాశ్చాత్య దేశాలలో ఉగ్రవాద దాడులు 280 శాతం పెరిగాయి.

**టెర్రరిజం అరికట్టడానికి ప్రహార్**

అయితే భారత్ ఉగ్రవాదాన్ని సమూళంగా అణిచివేయడానికి తగిన చర్యలు తీసుకుంటుంది. ఫిబ్రవరి 23న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ 'ప్రహార్' పేరుతో మెట్ట మొదటి జాతీయ ఉగ్రవాద నిరోధక విధానాన్ని విడుదల చేసింది. దేశంలో ఉగ్రవాదాన్ని నిరోధించే విధంగా ఈ విధానం చర్యలు తీసుకోనుంది.

**ఇండెక్స్ ఏ ఆధారంగా?**

గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ నాలుగు ప్రధానాంశాల ఆధారంగా గుర్తిస్తారు. సంవత్సరంలో ఆ దేశంలో జరిగిన ఉగ్రదాడుల సంఖ్య, మరణాలు, గాయపడిన వారి సంఖ్య, బందీలుగా చిక్కుకున్నవారు తదితర అంశాల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు.




# షకీరా భారత్ పర్యటన బ్రేక్

పశ్చిమ ఆసియాలో తీవ్రమవుతున్న ఘర్షణల కారణంగా షకీరా భారత సంగీత కచేరీ వాయిదా పడిందని నిర్వాహకులు తెలిపారు. ఏప్రిల్‌లో ముంబై, ఢిల్లీలలో జరగాల్సిన ఈ ప్రదర్శనలను "భౌగోళిక రాజకీయ పరిస్థితి, ప్రాంతీయ ఉద్రిక్తతల" కారణంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. టిక్కెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు పూర్తిగా డబ్బు వాపసు ఇవ్వబడుతుందని చెప్పారు.

ఈ కార్యక్రమం గురించి నిర్వహాకులు ఇలా ప్రకటించారు. "ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా.. షకీరా పాల్గొనవలసిన 'ఫీడింగ్ ఇండియా కాన్సర్ట్' మరో తేదీకి వాయిదా వేయబడింది. అభిమానుల రక్షణే మా యూనిట్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది. టిక్కెట్లు కొనుగోలు చేసిన వారందరికీ పూర్తి వాపసు ఇవ్వబడుతుంది," అని డిస్ట్రిక్ట్ అప్‌డేట్స్ ఇన్‌స్టాగ్రామ్ తమ హ్యాండిల్‌లో ఒక పోస్ట్ పేర్కొంది.


కొత్త తేదీని త్వరలో ప్రకటిస్తామని క్లారిటీ ఇచ్చారు. కొలంబియన్ సింగర్ షకీరా మత్తెక్కించే గాత్రంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. భారత్‌లో తొలిసారి ముంబైలో(2007) ఒక అద్భుతమైన కచేరీ చేసింది. ఇక్కడ అదే ఆమెకు తొలి ప్రదర్శన కావడం విశేషం. ప్రస్తుతం తన కొత్త ఆల్బమ్, "లాస్ ముజెరెస్ యా నో లోరన్ వరల్డ్ టూర్" (Las Mujeres Ya No Lloran World Tour) తో సంచలనం సృష్టిస్తోంది. ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఆమె ప్రదర్శనలు ఇస్తోంది.



# ఆ మాత్రం దానికి పెళ్లి ఎందుకు?

ఈ మధ్య చాలా మంది హీరోయిన్లు పెళ్లి చేసుకోమనే చెబుతున్నారు. మరికొంతమంది అయితే తనకు నచ్చిన అబ్బాయి దొరికితే చేసుకుంటా..లేదంటే సింగిల్‌గానే ఉంటామని అంటున్నారు. తాజాగా కన్నడ బ్యూటీ ఐశ్వర్య లక్ష్మి కూడా అదే కామెంట్ చేసింది. జీవితంలో పెళ్లి అనేది తప్పనిసరి కాదని, తోడు కావాలనుకుంటే సహజీవనం బెటర్ అని చెబుతోంది ఈ 34 ఏళ్ల సుందరి. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..'గత 30 ఏళ్ల నా జీవితంలో పెళ్లి చేసుకున్న జంటలను ఎన్నో చూశా. వారిలో సంతోషంగా జీవితం గడుపుతున్నవారు చాలా తక్కువ. పెళ్లి తర్వాత భాగస్వామి కెరియర్‌లో ఆటంకాలు కలగడం నన్ను ఆలోచింపజేశాయి. ఒకప్పుడు అందరి అమ్మాయిల్లాగానే నేను కూడా పెళ్లి చేసుకోవాలని కలలు కన్నాను. నా ప్రొఫైల్‌ని మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లోనూ పెట్టాను. అయితే నా ఫోటో చూసి ఫేక్ ప్రొఫైల్ అనుకున్నారు. అదే సమయంలో నాకు పెళ్లి వ్యవస్థపై నమ్మకం పోయింది.

నా ఆలోచనలు పూర్తిగా మారిపోయాయి. ఇద్దరు వ్యక్తుల మధ్య మనశ్శాంతి, తృప్తి ఉండాలి. అయితే అది పెళ్లితోనే సాధ్యం కాదని అర్థమైంది. నాకు కూడా తోడుగా ఉండే భాగస్వామి కావాలి. కానీ ఆ బంధం నిలబడడానికి పెళ్లి అనే ట్యాగ్ అవసరం లేదు. ఇద్దరి మధ్య మంచి అవగాహన, గౌరవం ఉంటే.. సహజీవనం చేయడం బెటర్. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే పెళ్లి కంటే ముందే సహజీవనం చేయడమే మంచిది.' అని ఐశ్వర్య చెప్పుకొచ్చింది. ఐశ్వర్య లక్ష్మి సినీ కెరీర్ విషయానికొస్తే.. ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ అయ్యాక 2017లో నందలవర నాడు నాడ్ ఒరు ఆవాలా సినిమాతో తన సినీ కెరీర్‌ని ప్రారంభించింది. మణిరత్నం తెరకెక్కించిన పొన్నియన్ సెల్వన్ సినిమాలో నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం రోహిత్ కెపి దర్శకత్వంలో వస్తున్న 'సంబరాల ఏటిగట్టు' సినిమాలో సాయి ధరమ్ తేజ్‌కి జోడీగా నటిస్తోంది.



# ఫిక్స్ చేశారా?

రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న సినిమా 'పెద్ది'.. మరో నెల రోజుల్లో థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే షూటింగ్ నడుస్తుండటంతో వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని రూమర్స్ వస్తున్నాయి. మరోవైపు చరణ్ పుట్టినరోజున ఓవర్సీస్ బుకింగ్స్ ఓపెన్ అవుతాయని అధికారికంగా ప్రకటించడంతో వాయిదా లాంటిది లేదని పరోక్షంగా క్లారిటీ ఇచ్చినట్లయింది. అయితే ఈ మూవీలోని ఐటమ్ సాంగ్ ఎవరు చేస్తారా అనే ప్రశ్న కూడా ఇంకా అలానే మిగిలిపోయింది. ఫైనల్‌గా దానికి సమాధానం దొరికేసినట్లు కనిపిస్తోంది.

గతంలో 'పెద్ది' ఐటమ్ కోసం పూజా హెగ్డే, ఆయేషా ఖాన్, మృణాల్ ఠాకుర్.. ఇలా చాలా పేర్లు వినిపించాయి. కానీ పాట షూటింగ్ ఇంకా బ్యాలెన్స్ ఉండేసరికి ఎవరిని తీసుకున్నారనే విషయం బయటకు రాలేదు. చివరకు ఇప్పుడు ముందు అనుకున్న వాళ్లలో మృణాల్ ఠాకుర్‌ని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. వచ్చే నెలలో ఈమె హీరోయిన్‌గా చేసిన 'డకాయిట్' రిలీజ్ కానుంది. దీని ప్రమోషన్స్‌లో పాల్గొనేందుకు ప్లస్ 'పెద్ది' సాంగ్ చేసేందుకుగానూ రాబోయే కొన్నిరోజులు ఈమె హైదరాబాద్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఈ ఐటమ్ పాటలో చరణ్‌మృణాల్‌తో పాటు జాన్వీ కపూర్ కూడా కాసేపు కనిపిస్తుందని అంటున్నారు. బుచ్చిబాబు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ విలేజ్ డ్రామాగా తెరకెక్కించారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, జగపతిబాబు తదితరులు కీలక పాత్రలు చేశారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించాడు. ఇప్పటికే రెండు పాటలు రిలీజ్ కాగా రెండూ సూపర్ హిట్ అయ్యాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com